# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## వంటగ్యాస్ కష్టాలు

### గ్యాస్ ఆఫీస్ వద్ద గృహస్తుల ఆందోళన



పలమనేరు, మార్చి 14, ప్రభాతవార్త:
ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధం ప్రభావం ప్రజలకు పెనుభారమైంది. ముఖ్యంగా వంటగ్యాస్ వినియోగదారులకు కష్టాలు రోజురోజుకూ ఎక్కువవుతున్నాయి. ఓ వైపు ధర పెరిగింది తప్ప గ్యాస్ కొరతలేదని ప్రభ:త్వం చెపుతున్నా క్షేత్రస్థాయిలో ఇందుకు విరుద్ధంగా వుంది. ఇళ్లలో గ్యాస్ కొరత తీవ్రం కావడంతో శనివారం పలమనేరు సమీపంలోని ఓ గ్యాస్ ఆఫీస్ వద్ద గృహస్తులు అందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి గృహస్తులకు సర్ది చెప్పాల్సి వచ్చింది. గ్యాస్ ఇరాన్– ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా గ్యాస్ కొరత తీవ్రమైంది. గతంలో రూ.890కి లభించే సిలెండర్ పెరిగిన ధర ప్రకారం రూ.960కి చేరింది. ఇంటికి గ్యాస్ సరఫరా చేసే సరికి ఈ ధర రూ.వెయ్యికి చేరింది. యుద్ధం జరగక ముందు గ్యాస్ సిలెండర్లు తెప్పించుకున్న వారు రోజులు లెక్కిస్తూ కాలం గడుపుతున్నారు. ఏ సమయంలో గ్యాస్ అయిపోతుందో ఒక వేళ వంట చేస్తున్న సమయంలో గ్యాస్ అయిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇళ్ళలో గ్యాస్ సిలెండర్ అయిపోతే కిరోసిన్ స్టౌవ్‌లు వాడకునే వారు. ప్రత్యామ్నాయంగా కట్టెలతో వంటలు చేసుకునే వారు. లేదా మళ్ళీ ఇస్తామని పక్కింట్ల నుంగా గ్యాస్ అరువుగా తెచ్చి వాడుకునే వారు. ఐతే నేటి పరిస్థితిలో పక్క ఇళ్ళలోనూ గ్యాస్ లభించడంలేదు. ఒక వేళ తమ ఇళ్లలో అయిపోతే ఏం చేయాలని ఆలోచనలో పడిపోతున్నారు. ఈ పరిస్థితిలో వంట గ్యాస్ కోసం ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా తెప్పించుకోవాలంటే అప్పటికప్పుడు గ్యాస్ అందుబాటులో ఉండడంలేదు. బుక్‌చేసిన వారం రోజులకు కూడా వస్తుందో లేదో తెలియడంలేదు. కొంతమంది గృహస్తులు ఏకంగా గ్యాస్ ఆఫీసుల వద్దకు వెళ్ళి డీలర్లను నిలదీసినా ఫలితం శూన్యం. గుంపులుగా గ్యాస్ ఆఫీసుల వద్దకు వెళ్ళి గొడవలు చేయడంతో సిబ్బంది ఆఫీస్ షెటర్లు దించి తాళాలు వేస్తున్నారు.

## వంట గ్యాస్ కొరత లేదు

### - జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్

చిత్తూరు, మార్చి 14 ప్రభాతవార్త:
జిల్లాలో వంట గ్యాస్ సమస్య ఏ మాత్రం లేదని జాయింట్ కలెక్టర్ ఎ.రాజేంద్రన్ పేర్కొన్నారు. వంట గ్యాస్ లభ్యతపై ఎదైనా సమస్య వుంటే కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 08572-242734 నెంబర్‌కు డయల్ చేస్తే వంట గ్యాస్‌పై వినియోగదారులకు సిబ్బంది స్పష్టత ఇస్తారన్నారు. చిత్తూరు జిల్లాలో గ్యాస్ ఏజెన్సీల ద్వారా వంట గ్యాస్ వినియోగదారులకు డొమెస్టిక్ సిలెండర్లు సాధారణ సరఫరా కొనసాగుతున్నదన్నారు. వంట గ్యాస్‌పై ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వంట గ్యాస్ సరఫరాపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడానికి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ అన్ని పని దినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తోందన్నారు. జిల్లాలోని వంట గ్యాస్ వినియోగదారులకు తగిన విధంగా గ్యాస్ నిల్వాలు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఏజెన్సీలో సంబంధిత తహసిల్దారును వంట గ్యాస్ సరఫరాపై పర్యవేక్షణ కోసం నియమించడం జరిగిందన్నారు. వినియోగదారులు తొందరపడి వెంటవెంటనే గ్యాస్ రీఫిల్లింగ్ కోసం బుకింగ్ చేసుకోవద్దని, వదంతులు నమ్మవద్దని స్పష్టం చేశారు. అలాగే గ్యాస్ వినియోగదారులు గ్యాస్ బిల్లులో వున్న ధర మాత్రమే డెలవరీ బాయ్‌కు చెల్లించాలని, ఎవ్వరు అదనపు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా ఎక్కువ మొత్తం డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలన్నారు.

## ఘనంగా శ్రీ అగ్నిమారెమ్మ రథోత్సవం

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త
స్థానిక డికెపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న అగ్నిమారెమ్మ అమ్మవారి 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం డికెపల్లి మాజీ సర్పంచ్ డివి సుబ్రమణ్యం (డికెపల్లి మణి) అధ్వర్యంలో అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రథోత్సవంకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు కలిగిన భకు_లు రథంపై మిరియాలు, చిల్లర నాణేలు, బొరుగులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం, పుష్పపల్లకి కార్యక్రమాలు జరగనున్నాయి. కార్యక్రమంలో నేతలు డివి భాస ్కర్, సత్య, బాబు, ప్రకాష్, సోము, పూజారి కుమార్, శ్రీనివాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేతలకు సంస్థాగత ఎన్నికల 'జ్వరం'

### అధికార టిడిపిలో అసమ్మతి సెగలు



ప్రభాతవార్త-తిరుపతి:
టిడిపి జాతీయ అధినేత, సిఎం నారాచంద్రబాబునాయుడు సొంత జిల్లాతోబాటు ప్రాతినిథ్యం వహిస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించే పరిస్థితిలో ఎమ్మెల్యేలు, నాయకులు లేకపోయారనే విమర్శలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ఏరుదాటేవరకు ఏటిమల్లన్న ఏరుదాటాక బోడిమల్లన్న అనే చందంగా టిడిపిలో రాష్ట్రస్థాయి నేతలు,పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు, నామినేటెడ్ పదవులు అందుకున్న నాయకుల తీరు మారింది. కనీసం పార్టీలో సంస్థాగత లోపంతో టిడిపిలో అసమ్మతి సెగలు వీస్తున్నాయనే వాదనలు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే పార్టీ సంస్థాగతంగా బలహీనంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో 11 స్థానాలు టిడిపి, ఒక స్థానం జనసేన దక్కించుకున్నాయి. కూటమికి చెందిన 12 మంది ఎమ్మెల్యేలలో కొందరి పనితీరు ఆశించిన స్థాయిలో లేదని పార్టీ వర్గాలే ఆవేదన వెల్లగక్కుతున్నాయి. పలువురు ఎమ్మెల్యేలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో వ్యాపారాలతో బిజీగా ఉంటూ కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ప్రధానంగా జిల్లా నుండిమంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం కూడా కార్యకర్తల్లో అసంతృప్తికి కారణమవుతోంది. చిత్తూరు, తిరుపతి జిల్లాలకు నియమించిన ఇన్‌చార్జ్ మంత్రులు కూడా తరచూ అందుబాటులో ఉండడం లేదని స్థానిక నేతలు పేర్కొంటున్నారు. మరోవైపు పార్లమెంటు స్థాయి పార్టీ అధ్యక్షులు, కార్యదర్శుల వ్యవస్థ కూడా ప్రభావవంతంగా పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి.జాతీయ, రాష్ట్ర కమిటీల ఏర్పాటులో జాప్యం జరుగుతుండగా, నామి నేటెడ్ పదవులు పొందిన నాయకులు కూడా చురుకుగా వ్యవహరించడం లేదని పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారం లేని సమయంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులను విస్మరించారని కూడా కొందరు ఆరోపిస్తున్నారు. కొన్ని పదవులు డబ్బుకు అమ్ముకున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రాయలసీమ రాజకీయాలకు కేంద్రంగా భావించే తిరుపతిలో ప్రస్తుతం ప్రతిపక్షమైన వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. టిటిడి, బోర్డు చైర్మన్ బి ఆర్ నాయుడుపై విమర్శలు గుప్పిస్తున్నా అధికార పార్టీ నుంచి పెద్దగా స్పందన కనిపించకపోవడం కూడా చర్చకు దారితీసింది.ఇటీవల వైసీపీ నిర్వహించినట్లు ప్రచారం జరుగుతున్న అంతర్గత సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే జిల్లాలో వైసీపీకి ఎనిమిది, టిడిపికి ఆరు స్థానాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్టు సమాచారం..ఈ నేపథ్యంలో ఆరునెలల్లో జరగనున్న స్థానిక సంస్థల కార్పొరేషన్, మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ ఎన్నికలను ఎదుర్కోవడం అధికార పార్టీ కెంతవరకు సులభమో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉగాది తరువాత అయినా టిడిపి జాతీయ, రాష్ట్ర కమిటీలను పూర్తి చేసి మిగిలిన నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని కార్యకర్తలు కోరుతున్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె ప్రాంతాలకు చెందిన బలమైన నాయకులకు ఆ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు నాయకులు సూచిస్తున్నారు.

## జీవన ప్రగతి సాధనే మెట్లోత్సవం అంతరార్థం

తిరుమల,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి:
తాళ్లపాక అన్నమాచార్యుల 523వ వర్ధంతి పురస్కరించుకుని టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శనివారం ఉదయం అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లోత్సవం వైభవంగా నిర్వహించారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్ పవిత్రమైన మెట్లోత్సవంలో పాల్గొనడం ఎంతో పుణ్యఫలాన్ని ఇస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి వచ్చిన దాదాపు వెయ్యికి పైగా భజన మండళ్ల సభ్యులు, ప్రముఖ సంగీత కళాకారులు భజనలు చేస్తూ సప్తగిరులను అధిరోహించారు. సింగపూర్ నుండి 20 మంది కళాకారులు స్వచ్ఛందంగా విచ్చేశారు. సింగపూర్‌కు చెందిన డాక్టర్ కె. భాగ్యమూర్తి ఆధ్వర్యంలో "అష్టలక్ష్మి ృ విద్యార్థుల బృందం" శనివారం ఉదయం మెట్లోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకురాల లత, అన్నమాచార్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు పాల్గొన్నారు.

### -మెట్లోత్సవంలో సింగపూర్ కళాకారులు



## రేపటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

**జిల్లావ్యాప్తంగా 179 పరీక్ష కేంద్రాలు.. హాజరుకానున్న31,334 మంది విద్యార్థులు**
**30 సెట్టింగ్, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లతో ప్రత్యేకం పర్యవేక్షణ.. నిఘా నీడలో సమస్యాత్మక కేంద్రాలు**
**పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు.. గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి**
**మీడియా సమావేశంలో డి ఈ ఓ కే వి ఎన్ కుమార్**

తిరుపతి విద్య మార్చి 14 ప్రభాతవార్త.
తిరుపతి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలు మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఈసారి మొత్తం 31,334 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 29,165 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1,178 మంది సప్లిమెంటరీ (ఒన్స్ ఫెయిల్డ్ ) విద్యార్థులు, 991 మంది ఎ పి ఓ ఎస్ ఎస్ విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థులలో బాలురు 14,027 మంది, బాలికలు 12,631 మంది ఉన్నారని తెలిపారు.డివిజన్ వారీగా గూడూరు డివిజన్‌లో 9,217 మంది, పుత్తూరు డివిజన్‌లో 7,309 మంది, తిరుపతి డివిజన్‌లో అత్యధికంగా 12,271 మంది, రైల్వే కోడూరు డివిజన్‌లో 2,537 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 62 పరీక్షా జోన్లు, 165 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో 179 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 179 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 1,435 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న 655 పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.పరీక్షల పర్యవేక్షణ కోసం 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 30 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 8 సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అదనపు సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్ష ప్రారంభానికి కనీసం ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సదుపాయాలు మరియు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటాయని తెలిపారు.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఏపీఎస్‌ఆర్ టి సి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. అలాగే హాల్ టికెట్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను మొబైల్ ద్వారా స్కాన్ చేసి పరీక్షా కేంద్రానికి చేరుకునే మార్గాన్ని తెలుసుకునే సదుపాయం కూడా కల్పించబడిందని చెప్పారు.పరీక్షల సమయంలో జిల్లాలోని ఏ పరీక్షా కేంద్రంలోనైనా సమస్య తలెత్తినట్లయితే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 7842641323 ను సంప్రదించాలని సూచించారు.

### పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం



జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షా నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, తల్లి దండ్రులు కూడా పిల్లలకు ప్రోత్సాహం అందించి సహకరించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ యంత్రాంగం మొత్తం పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసి విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

### లోబావి అతిథి గృహాల్లో

## ఉచిత నిత్యాన్నదాన భోజనం





సత్రాల్లో ఉచితభోజన పథకంను అమలు చేసి పరిశీలిస్తున్నదృశ్యం, కన్నప్ప కొండపైకి వెళ్ళుమెట్లపై రంగులు వేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలకు కొత్త కార్య నిర్వహణాధికారి బికె వెంకటేశు శ్రీకారం చుట్టారు.భక్తులకు సదుపాయాలు కల్పించుటకు అలాగే ఆలయానికి ఆదాయాలు వచ్చే మార్గాలను ప్రోత్సహించుటకు చర్యలు తీసుకుంటున్నారు.వచ్చిన భక్తులకు సుదర్శనం తో పాటు బస సదుపాయాలకు చర్యలు తీసుకుంటున్నారు.ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాత క్షుణ్ణంగా అధ్యనం చేసారు.ముఖ్యంగా ఆలయానికి సంబందించిన అన్ని అతిధి గృహాలను ఆయన వ్యక్తిగతంగా పరిశీలించారు. అక్కడ పరిస్థితిని అధ్యయనం చేసారు. కోట్లు వెచ్చించి నిర్మించిన అతిధి గృహాల్లో పరిస్థితి అక్కడ భక్తులకు గల సదుపాయాలను పరిశీలించారు.ఈ నేపథ్యంలో శనివారం నుంచి చర్యలు మొదలు పెట్టారు.ముఖ్యంగా లోబావిలో సుమారు 125గదుల సత్రాలను గంగా సదన్, కైలాససదన్‌లో భక్తులకు ఉన్న సదుపాయాలు,అక్కడ భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి దూరంగా భక్తులకు ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించిన సదన్‌లలో సదుపాయాలతో పాటు భక్తులకు శనివారం నుంచి ఉచితంగా భోజన సదుపాయాలు కల్పించారు. శనివారం ఆయన ప్రారంభించారు. ప్రతి రోజూ ఇక్కడ భక్తులకు మధ్యాహ్నం 12.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 8గంటల వరకు భక్తులకుభోజన వసతి కల్పించారు.ఈ మేరకు ఈ అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని తన సిబ్బందికి ఆదేశించారు. కాగా భక్త కన్నప్ప కొండపైకి నడచి వెళ్ళు భక్తుల సౌకర్యార్థం కాళ్లు కాలకుండా ఉండటానికి వైట్ పెయింట్‌ను వేయించారు.

### పట్టపగలే

## బంగారం షాపులో చోరీ

### - కళ్లలో కారంకొట్టి బంగారం అపహరణ





సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త
పట్టణంలోని కచ్చేరివీధిలో గల శ్రీ వెంకటేశ్వర జ్యుయలర్స్ షాపులో గుర్తు తెలియని అగంతకుడు పట్టపగలే బంగారు షాపు యజమాని కళ్లలో కారంకొట్టి 150 గ్రాముల బంగారాన్ని చోరీ చేసి పరారైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బంగారం షాపు నిర్వహిస్తున్న ముత్యాల సుబ్బయ్య షాపులోకి గుర్తుతెలియని వ్యక్తి బంగారం కొనుగోలు చేసే నెపంతో వచ్చాడు. అనంతరం షాపులోని వివిధ రకాల నగలను పరిశీలించి కొనుగోలు చేసే విధంగా యజమాని సుబ్బయ్యతో మాటలు కలిపాడు. కొద్దిసేపు నగలను పరిశీలించిన తర్వాత షాపు యజమాని కొంచెం ఏమరుపాటుగా ఉండటాన్ని గమనించి తన వెంట తెచ్చుకున్న కారాన్ని అతని కళ్లలో కొట్టి బంగారం చోరీ చేసి పరారయ్యాడు. మధ్యాహ్నం వేళ కావడంతో జనసంచారం అంతంతమాత్రంగా ఉండటాన్ని అగంతకుడు ఉపయోగించుకున్నాడు. తేరుకున్న సుబ్బయ్య అగంతకుని వెంట పరుగులు తీసినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ అజయ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని షాపులోని సిసి ఫుటేజి పరిశీలించారు. అనంతరం నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు సూళ్లూరుపేట పోలీసుస్టేషన్‌కు చేరుకుని కేసు వివరాలు తెలుసుకున్నారు. అగంతకుడు తమిళనాడు ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే శుక్రవారం రాత్రి షార్ బస్టాండ్ సమీపంలో టీ కేఫ్‌లో గుర్తుతెలియని వ్యక్తి లోపలికి ప్రవేశించి దుకాణంలోని గల్లా పెట్టెలో నగదు చోరీ చేశాడు. ఈ ఘటన షాపులోని సిసి ఫుటేజిలో నమోదై ఉంది. పట్టణంలో వరుస చోరీల పట్ల పోలీసులు అప్రమత్తం అయ్యారు. మొత్తంమీద పట్టణంలో చోరీ ఘటనలు చర్చనీయాంశంగా మారాయి.

## కన్నుల విందుగా శ్రీనివాస కళ్యాణం

### ..భక్తులతో కళకళలాడిన కొల్లాపూరి అమ్మవారి ఆలయం





చిన్నగొట్టిగల్లు, మార్చి 14 ప్రభాతవార్త
చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారి గడ్డ పంచాయతీ పరిధిలోని శ్రీ కొల్లాపూరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ శ్రీనివాస స్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తి భావాలతో నిండిన వాతావరణంలో జరిగింది. టీటీడీ వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీనివాస స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదఘోషల నడుమ జరిగిన ఈ పవిత్ర వేడుక భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో ముంచెత్తింది. స్వామివారి దివ్య కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. కళ్యాణోత్సవాన్ని దర్శించుకున్న భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందిన ఆనందంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన ప్రసాద లడ్డూలను పంపిణీ చేశారు. అలాగే అన్నప్రసాదం వితరణ నిర్వహించి భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.

ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయం ఆధ్యాత్మిక కాంతితో కళకళలాడింది.

## జనసేన పార్టీ ప్రభంజనంలా విస్తరిస్తోంది

– కుప్పం ఇన్‌చార్జ్ నరేష్ – ఘనంగా 13వ ఆవిర్భావ దినోత్సవం !!



కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త

జనసేన పార్టీ ఓ జ్వాలలా ప్రజల్లో వెలుగుతూ ప్రభంజనంలో విస్తరిస్తోందని కుప్పం జనసేన ఇన్‌చార్జ్, కాణిపాకం డైరెక్టర్ నరేష్ పేర్కొన్నారు. శనివారం జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ తిరుపతి గ ంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుడుపల్లె మండలం పచ్చార్లపల్లి గ్రామంలో జనసేన పార్టీ పతాకావిష్కరణ చేశారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈసందర్భంగా నరేష్ మాట్లాడుతూ ముళ్లదారిలో కూడా ధైర్యంగా ముందుకు నడిచి చూపించిన వ్యక్తి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనా ్నరు. జనసేన లేకుండా తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్ర పూర్తి కాదన్నారు. మహోన్నత ఆశయం కోసం కార్యకర్తలు డిసిఎం అడుగుజాడల్లో నడవాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం సభ్యత్వ నమోదు చేసిన సాధక్‌లను సత్కరించారు. కార్యక్రమంలో జనసేన నేతలు అమీర్, పవన్, మహేష్, హరీష్, బాలు, రామూర్తి, వేణు, నవీన్, వామనమూర్తి, మంజునాథ్, సురేష్, హంసగిరి, చంద్రశేఖర్, పాండు, రూపేష్, నవనీత, దివ్య, హేమ, సరస ్వతి, శ్రీధర్, సుబ్రమణ్యం, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీలకు అండగా సిఎం చంద్రబాబు

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు సిఎం చంద్రబాబునాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కంగుంది మసీదులో ముస్లింల పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్న ం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబులు హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ తొలినుంచి ముస్లింలసంక్షేమం కోసం సిఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారన్నారు. మైనార్టీలకు కార్పోరేషన్ రుణాలు, దుకాన్ మకాన్ పథకం, మసీదులు, ఈద్గాల మరమ్మత్తులకు నిధులతో పాటు ఇమాం, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ముస్లింలు రమజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని పేర్కొంటూ ముందస్తు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, ప్రధాన కార్యదర్శి ధనశేఖర్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు జాకీర్, షాదీఖానా ఛైర్మన్ సర్దార్, మాజీ ఛైర్మన్ అన్సర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునాఫ్, ప ంచాయతీ అధ్యక్షుడు షరీఫ్, మైనార్టీలు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌చే గ్యాస్ గోడౌన్ తనిఖీ



శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త

మండలంలోని రాళ్లబూదుగూరులో ఉన్న హెచ్‌పి గ్యాస్ గోడౌన్, కార్యాలయాన్ని శనివారం తహశీల్దార్ ప్రకాష్‌బాబు తనిఖీ చేశారు. వినియోగదారులు ఎవరూ గోడౌన్ వద్దకు రావద్దని సిలిండర్ బుక్ చేసిన 48గంటల్లోగా డీలర్లు సరఫరా చేస్తారన్నారు. రెండో సిలిండర్ 45 రోజుల్లో అందిస్తారన్నారు. హోటళ్లలో ఎవరైనా డొమెస్టిక్ సిలిండర్లు వాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ అధినేత మంజునాథ్, చెంగారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్ధగిరి పూర్వ వైభవంకు దాతలు సహకరించాలి

– పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్

తవణంపల్లి, మార్చి 14 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంకు పూర్వ వైభవం తీసుకురావడానికి దాతలు సహకరించాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. శనివారం మండలంలోని కొండ్రాజుల కాలువ గ్రామ సర్పంచ్ పరందామనాయుడు కుటుంబీకులు అర్ధగిరి ఆలయంలో స్వామి వారికి త్రికాల నిత్య నైవేథ్యం సమర్పించడానికి రెండు సంవత్సరాల కాలానికి అవసరమైన సుమారు రూ.18 లక్షలు విలువ గల పడితరం సామాగ్రిని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఆలయ ఇఓ ఇ.మునిశేఖర్‌లకు అర్ధగిరిలో అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్ధగిరి ఆలయంను సర్వతోముఖాభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురాడానికి అందరు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి దేవస్థానం వద్ద మౌళిక వసతుల కల్పనకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ.20 లక్షలు నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో వివిధ రకాల ఔషద మొక్కలు పెంపకం చేపట్టడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆలయ అభివృద్ధికి దాతలు బూరి విరాళాలను అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లి, ఐరాల మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వరచౌదరి, హరిబాబునాయుడు, జిల్లా తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి సునీల్‌చౌదరి, కాణిపాకం ఆలయ ఛైర్మన్ మణినాయుడు, బంగారుపాళ్యం ఎఎంసి ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, పాలసముద్రం, ఐరాల మాజీ జడ్పీటిసీలు భీమినేని చిట్టిబాబు, లతలు, అరగొంగ, తవణంపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు ఎ.రంజిత్‌రెడ్డి, అమరేంద్రనాయుడులు, టిడిపి మాజీ మండల అధ్యక్షులువేణుగోపాల్‌నాయుడు, ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 19న కాణిపాకంలో ఉగాది వేడుకలు

కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీన శ్రీపరాభవ నామ తెలుగు నూతన సంవత్సరం ఉగాది వేడుకలను సంప్రదాయ రితీలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మూల విరాట్‌కు ఉదయం ప్రత్యేక అభిషేకం, చందన అలంకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రధాన ఆలయంలో కళ్యాణ వేదిక వద్ద దేవస్థానం, అర్చక, వేద పండితులు, పురోహితుల సమక్షంలో ఉదయం 9 గంటల నుండి 10.12 గంటల వరకు పంచాంగ శ్రావణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం వుంటుందన్నారు. ఉగాది వేడుకల సందర్భంగా ప్రధాన ఆలయంలో జరిగే అన్ని రకాల అర్జిత సేవలను ఉదయం నుండి రాత్రి వరకు రద్దు చేస్తున్నట్లు ఆయన ఇఓ తెలిపారు. ఈ ఉగాది వేడుకలకు ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబు లక్ష్యం : గౌనివారి

శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త



రైతుల స ంక్షేమం కోసం సిఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రైతుకు ఇరవై వేల సాయం అందిస్తోందన్నారు. తాజాగా 46.85లక్షల మంది రైతుల ఖాతాల్లో 2670కోట్లు నేరుగా జమ చేసిందన్నారు. డ్రోన్ టెక్నాలజీ, డ్రిప్ ఇరిగేషన్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుతో ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టును వేగంగా నిర్మిస్తోందన్నారు. రైతుల పంటల గిట్టుబాటు ధరల కోసం 500కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుచేశారన్నారు. మామిడి, టమోటా, కోకో రైతులను ఆదుకున్నారన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రం అప్పుల సుడిగుండంలో నెట్టబడిందని పేర్కొన్నారు. ధాన్యం రైతులకు 24గంటల్లోనే నగదు జమ చేసిందన్నారు.

## జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం

పలమనేరు, మార్చి 14, ప్రభాతవార్త:



జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం శనివారం పలమనేరులో ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ఎంబిటి రోడ్డులో నెహ్రూ విగ్రహం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పూల మాలలు వేసి జై పవన్ కల్యాణ్, జైజై పవన్ కల్యాణ్ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. బాణ సంచా కాల్పులతో ఎంబిటి రోడ్డు మారుమోగింది. భారీ సైజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పార్టీ చిరస్థాయిగా ఉండాలని, పవన్‌కల్యాణ్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి పసుపులేటి దిలీప్, నాయకులు అరుణ్‌కుమార్, మోత్కూరు నాగరాజు, మాధవ, దొంతల రమేష్, రంపాల శివ, రమేష్, అనిల్, వినోద్, సోము, హరి, పవన్, నాని, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

పలమనేరు. మార్చి 14, ప్రభాతవార్త:

పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. శుక్రవారం రాత్రి స్థానిక రంగాపురంలోని మసీదులో జరిగిన విందులో పాల్గొన్నారు. అంతకు ముందు మసీదులో నిర్వహించిన నమాజులో పాల్గొని పేరుపేరునా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ముస్లిం భాయీ-భాయీ అన్న విధంగా ఎంతో మంది హిందువులు కూడా ఈ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. అల్లా చల్లగా కాపాడాలని ప్రజలంతా సుభిక్షంగా వుండాలని ఆకాక్షించారు. సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ. తెలుగుదేశం నాయకులు ఖాజా, నాగరాజ్, గిరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 4.22లక్షల విలువ చేసే టపాకాయలు సీజ్

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమంగా టపాకాయలు నిల్వ ఉంచి విక్రయించడాన్ని గుర్తించి 4.22లక్షల విలువ చేసే టపాకాయలు సీజ్ చేసినట్లు అర్బన్ సిఐ శంకరయ్య తెలిపారు. కుప్పం ప్యాలస్‌రోడ్‌తో దేవేంద్రన్ అనే వ్యక్తి తన ఇంటిముందర ఉన్న ఖాళీ స్థలంలో టపాకాయలు నిల్వ ఉంచాడనే సమాచారంతో కుప్పం డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో తాను, అర్బన్ ఎస్సై బాబు, సిబ్బంది కలసి దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. అక్కడ భారీ మొత్తంలో టపాకాయలు నిల్వ ఉండడాన్ని గుర్తించి సీజ్ చేశామన్నారు. పట్టుబడిన టపాకాయల విలువ 4,22,260రూ.లని తెలిపారు.

## సిఎం చంద్రబాబును కలసి వివాహంకు ఆహ్వానం

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడును తెదేపా 12వ క్లస్టర్ ఇన్‌చార్జ రోహిత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఈనెల 24,25 తేదీల్లో జరిగే తన వివాహంకు హాజరు కావాలని కోరుతూ రోహిత్‌కుమార్ సిఎంకు పెళ్లిపత్రికను అందించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు వివాహంకు హాజరయ్యేందుకు కృషి చేస్తానని తెలిపి అతన్ని ఆశీర ్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ వేడి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి : డిఎస్పీ

– పిజి హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు !!

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త




విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమంలో భాగంగా శనివారం తెల్లవారి పిఇఎస్ వైద ్య కళాశాల ఎదురుగా ఉన్న పిజి హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు అలవాటు పడితే కలిగే అనర్థాలను వివరించారు. హాస్టళ్ల వద్ద తగిన సెక్యూరిటీ ఏర్పాటుచేయాలని యాజమాన్యాలను ఆదేశించారు. హాస్టళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుతో పాటు అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, వెంకటమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 1083 కేసులు పరిష్కారం

కుప్పం, మార్చి 14 ప్రభాతవార్త



కుప్పం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 1083కేసులు పరిష్కరించినట్లు చిత్తూరు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి శిరీష తెలిపారు. 15 సివిల్ కేసుల ద్వారా 37,88,140రూ.లు, 1060క్రిమినల్ కేసుల ద్వారా 15,95453రూ.లు సెటిల్‌మెంట్ అయిందన్నారు. ఈకార్యక్రమంలో బెంచ్ మెంబర్ శైలశ్రీ, ఎపిపి ప్రశాంతి, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రప్ప, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

పూతలపట్టు, మార్చి 14, ప్రభాతవార్త



మండల పరిధిలో ఉన్న ఆర్‌విఎస్ నగర్ సమీపాన శనివారం రెండు బైకులు ఢీకొన్నాయి. స్థానికుల వివరాలు మేరకు వేల్పూరు చెందిన హేమంత్ విజయం కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో తన మిత్రులతో ద్విచక్ర వాహనంపై ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు వస్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టాడు. తీవ్ర గాయాల గాయాలై స్పృహ కోల్పోయాడు. అంబులెన్స్ ఫోన్ చేయగా సకాలంలో రాకపోవడంతో ఆటో సహాయంతో ఆర్‌విఎస్ హాస్పిటల్‌కి తరలించారు. డ్రగ్స్ తీసుకోవడం, మందు తాగడం, గంజాయి తాగడం చాలా మందికి అలవాటైంది. ఈ అలవాటు వల్ల టూ వీలర్ నడపడం, కారు నడపడుతున్న సమయంలో తాము వాహనం ఎలా నడుపుతున్నామో కూడా తెలియక ప్రమాదాల భారిలో పడుతున్నారు. దీనిని అరికట్టడానికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేయడం ప్రతినిత్యం జరగాలని, అలాగే ప్రతి విద్యార్థి కదలికను తల్లిదండ్రులు గుర్తించాలని, కాలేజీ అటెండెన్స్ సక్రమంగా లేకపోతే ఎప్పటికప్పుడు విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేస్తూ ఉండాలి. యువత మేలుకో నీపైన ఆధారపడినటువంటి నీ తల్లిదండ్రులు మీ అక్క చెల్లెలు, అన్నదమ్ములకు ఆసరాగా ఉండాల్సినటువంటి వారు రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల మీ కుటుంబాన్ని రోడ్డుపాలు చేయకుండా చూసుకోండని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

గుడిపాల, మార్చి 14 ప్రభాతవార్త:



జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మండల కేంద్రం జనసేన మండల పార్టీ కార్యాలయంలో శనివారం మండల పార్టీ అధ్యక్షులు రూప్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర జనసేన పొలిటికల్ కార్యదర్శి ఆరణి కవిత, నాయకులు ఉయ్యాల శ్రీనివాస్, డికె చైతన్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ అట్టడుగు స్థాయి నుండి మరింత పటిష్టంగా తయారవుతుందన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కమ్మతిమ్మపల్లి క్రాస్ వద్ద జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు రూప్‌కుమార్, జనసేన నాయకులు యశ్వంత్, దయారాం, పృథ్వి, ఆదికేశవులు, సంతోష్, భాను, సింధురాయల్, బాబు యాదవ్, మురళీ, వినీత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్లకోమా వారోత్సవాలు

చిత్తూరుహెల్త్, మార్చి 14 ప్రభాతవార్త:




చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా ఆంథత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ అర్పిత, చిత్తూరు అపోలో ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘనంగా గ్లకోమా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 40 సంవత్సరాలు దాటిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి వైద్యాధికారులు వారికి తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అంథత్వ నివారణ అధికారి డాక్టర్ అర్పిత మాట్లాడుతూ గ్లకోమా అనేది కంటికి సంబంధించిన వ్యాధి అన్నారు. కంటి లోపల పీడనం పెరిగి కంటి నరాలు చచ్చుపడి పోయేటట్లు చేస్తోందన్నారు. తద్వారా నెమ్మదిగా కంటి చూపు తగ్గిపోతుందన్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారి ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు మార్చి 8వ తేదీ నుండి ప్రారంభమై శనివారంతో ముగుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆంథత్వ నివారణ అధికారి డాక్టర్ అర్పిత, నేత్ర వైద్య విభాగాధిపతి డఆక్టర్ కుమార్ అమృత్, పారా మెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు ధర్మారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అపోలో కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిటన్ యూనివర్సిటీతో అపోలో భాగస్వామ్యం బలోపేతం

– చిత్తూరు విద్యార్థులకు యూకేలో డిగ్రీ అవకాశాలు

చిత్తూరుహెల్త్, మార్చి 14 ప్రభాతవార్త:



చిత్తూరు మురకంబట్టులోని ది అపోలో యూనివర్సిటీ, బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ మధ్య కొనసాగుతున్న అంతర్జాతీయ విద్యా భాగస్వామ్యం మరింత బలపడుతోంది. యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ ప్రో వైస్ ఛాన్సలర్, కళాశాల హెడ్, మెడిసిన్ డీన్ ప్రొఫెసర్ థామ్సన్ రాబిన్సన్ శనివారం అపోలో యూనివర్సిటీని సందర్శించారు. ఈ సంధ్భంగా ఆయన అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.వినోద్‌భట్, విశ్వవిద్యాలయ ఉన్నత అధికారులు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశం అయ్యారు. రెండు యూనివర్సిటీల మధ్య విద్యా పురోగతి, కోర్సుల రూపకల్పన, భవిష్యత్ సంయుక్త కార్యక్రమాలు, విద్యార్థుల అంతర్జాతీయ అవకాశాలు, పరిశోధన భాగస్వామ్యాలపై ఆయన విస్తృతంగా చర్చించారు. రెండు విశ్వ విద్యాలయాల సంయుక్త భాగస్వామ్యంతో అమలు అవుతున్న 2+1 అంతర్జాతీయ పాథ్‌వే ప్రోగ్రాం ఈ భాగస్వామ్యంలో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మొదటి రెండు సంవత్సరాలు చిత్తూరులోని అపోలో యూనివర్సిటీలో చదివి చివరి సంవత్సరం ఇంగ్లాంగ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ క్యాంపస్‌లో కోర్సును పూర్తి చేస్తారు. కోర్సు పూర్తి అయ్యాక విద్యార్థులకు యూనివర్సిటీ ఆఫ్ లీసెస్టర్ డిగ్రీ ప్రదానం చేయబడుతుంది. ఇది ఇంగ్లాంగ్‌లోనే చదివిన విద్యార్థులకు ఇచ్చే డిగ్రీతో సమాన గుర్తింపు కలిగి వుంటుంది. అపోలో యూనివర్సిటీలో ప్రస్తుతం ఈ కార్యక్రమం బి.ఇంజనీరింగ్, బిబిఎ కోర్సుల్లో అందుబాటులో వుంది. బి.ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ కోర్సులో అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, ఆధునిక కంప్యూటింగ్ టెక్నాలజీలపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అలాగే బిబిఎ కోర్సు అంతర్జాతీయ వ్యాపార రంగానికి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా రూపొందించబడింది. ఈ రెండు కోర్సులు దేశీయంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలకు దోహదపడేలా రూపొందించబడ్డాయి. ఈ సందర్భంగా అపోలో యూనివర్సిటీ, అపోలో హాస్పిటల్స్, యూనివర్సిటీ లీసెస్టర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ డిజిటల్ హెల్త్ అండ్ ప్రెసిషన్ మెడిసిన్ కార్యకలాపాలపై చర్చించారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యతో పాటు ప్రపంచ స్థాయి పరిశోధన, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అపోలో విశ్వవిద్యాలయ అధికారులు పేర్కొంటున్నారు.

## 17న కాణిపాకం ఆలయ ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం

కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం ఈ నెల 17వ తేదీ జరుగుతుందని ఆలయ ఇఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో దేవస్థానంకు అవసరమైన సరుకుల సరఫరాపై వాటి ప్రభావంను దృష్టిలో వుంచుకుని దేవస్థానం ఉపయోగించే గ్యాస్ సిలెండర్ల సరఫరా సంబంధిత ఏర్పాట్లను సమీక్షించడానికి 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా 13వ జనసేన ఆవిర్భావ దినోత్సవం

సత్యవేడు, మార్చి 14 ప్రభాతవార్త:



సత్యవేడు పట్టణంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు, జన సైనికులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టవర్‌క్లాక్‌వద్దను జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించి భారీ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆ పదవికి మరింత గౌరవం తీసుకువస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నారని పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతం కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం సత్యవేడు నియోజకవర్గంలో ఉత్సాహంగా కొనసాగుతోందని, ఈ నెల 17వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రూపేష్, జనసేన సీనియర్ నాయకులు బాల మురళి, వైస్ ప్రెసిడెంట్ హేమంత్, పట్టణ అధ్యక్షుడు దుర్గం మనీ రాయల్, జనరల్‌సెక్రటరీలు జ్యోతి, దినేష్, అనిల్, ముని, కుమార్, ప్రసన్న, ఆర్గనైజింగ్‌సెక్రటరీలుపవన్‌కుమార్,రాజేష్, హరీష్, పి.ఆర్.బాలాజీ, తదితర జన సైనికులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా టీడీపీ పార్టీ : ఎమ్మెల్యే

వడమాలపేట, మార్చి 14 ప్రభాతవార్త:



నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ముద్దుబాబు నరసింహులురాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఇతను తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకుని ఉండడంతో కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి బీమా మంజూరైంది. వీరి కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల చెక్కును భానుప్రకాష్ శనివారం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి వెళ్లి నరసింహారాజు సతీమణి భవానికి అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మణిరాజు, నాయకులు ధనంజయులు నాయుడు, దాము యాదవ్, శివరాయల్, దేవా తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలలో రాత్రంతా "కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్"

చంద్రగిరి, మార్చి 14 ప్రభాతవార్త:



గంజాయి స్మగ్లర్ల భరతం పట్టేందుకు కాలనీలలో పోలీసు బలగాలు రాత్రంతా విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చంద్రగిరి అక్కగార్ల కాలనీ, వికలాంగుల కాలనీ, టీడీ కాలనీ, జోగుల కాలనీలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో, సిఐ సురేష్ కుమార్ పర్యవేక్షణలో పలువురు ఎస్ఐలు, పెద్ద ఎత్తున పోలీసు బలగాలు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల రక్షణార్థమై అపరిచిత వ్యక్తులు, గంజాయి స్మగ్లర్ల ఆచూకీని పసిగట్టేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. కాలనీలలో గంజాయి వినియోగం, విక్రయం వంటి అసాంఘిక కార్యకలాపాలపై తమకు సమాచారం వుందన్నారు. చంద్రగిరి గంజాయి మహమ్మారిని తరిమి కొట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా సరైన రికార్డులు లేని వాహనాలు, తగిన గుర్తింపు కార్డులు లేని అపరిచిత వ్యక్తులను గుర్తించేందుకు ఇటువంటి తనిఖీలు దోహదపడగలవన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు తమవంతుగా సహకరించాలని కోరారు. గ్రామాలలో తనిఖీల పేరిట ఇబ్బందులు గురి చేయడం తమ పద్ధతి కాదని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని ఆయన మహిళలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు అరుణాచలం, రవిప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు ఫార్మాసిస్టులదే : డాక్టర్ సతీష్‌బాబు

రామచంద్రాపురం, మార్చి 14 ప్రభాతవార్త:



భవిష్యత్తు ఫార్మాసిస్టులదేనని రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధి డాక్టర్ సతీష్‌బాబు అన్నారు. శనివారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ అనలిజ్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో ఏఐ, త్రిడి ప్రింటింగ్ నియంత్రణ, సంసిద్ధతకు నాణ్యతా హామీ అనే అంశంపై ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ పేపర్ రచన, ఆధునిక పరిశోధనలపై విద్యార్థులకు అవగాహనకల్పించారు. పలువురు విభిన్న కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులలోమౌఖిక, పోస్టర్ ప్రజెంటేషన్, అంశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్‌బాబు, ఆర్ చంద్రశేఖర్, సదస్సు కన్వీనర్ శివగామి, తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల భుజాలపై నిర్మించబడిన పార్టీ జనసేన

రామచంద్రాపురం, మార్చి 14 ప్రభాతవార్త:



కార్యకర్తల భుజాలపై నిర్మించబడిన పార్టీ జనసేన అని చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ అన్నారు. శనివారం రాయలచెరువు పేటలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కార్యకర్తలు, అభిమానుల నడుమ జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకుల నడుమ సుధీర్ఘ పోరాటం అనంతరం పవన్ కళ్యాణ్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం జనసేన 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి అడుగుపెట్టడం గర్వకారణమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి జనసైనికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ ఇన్‌చార్జ్ ఈవి రాయల్, నాయకులు సాయి, నాగభూషణం, శ్రీరామ్, గోపాలయ్య, పెనుగొండ రఘునాథ్, అశోక్, చందూ రాయల్, బెనర్జీ, వరుణ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## వేంకట మహాన్యాస్ కు అరుదైన గౌరవం.

చిట్వేలి, మార్చి 14, ప్రభాతవార్త :



స్థానిక చిట్వేలి గ్రామ నివాసి రాయి పెద్ది వేంకట మహాన్యాస్ శర్మకు(16)టీటీడీ వారు నిర్వహించిన ఋగ్వేధ స్మార్థంలో ద్వితీయ స్థానం పొంది శ్రీ శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి స్వామి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకున్నట్లు మహాన్యాస తండ్రి సుబ్రహ్మణ్యం శర్మ(సుబ్బు స్వామి) తెలియపరిచారు. శనివారం తాను మాట్లాడుతూ కంచి మఠం ఆధ్వర్యంలో తిరుపతి పెరుమాళ్ళపల్లిలో సుబ్రహ్మణ్యం, కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో గురువు గోపాల్ భట్టుచే వేద విద్యను అభ్యసించిన మహాన్యాస్ రఘువంశము, మూర్త దర్భనము, ఆశ్వలాయన గుహ్య సూత్రము, శాంతి కమలకరం, ఉపనిషత్తు, ధర్మ ప్రవృత్తి, చండీ యాగము, సూర్య నమస్కారాలు సంబంధిత యోగాధిక్రతువులపై జరిగిన పోటీ పరీక్షలో ప్రతిభ చూపి ద్వితీయ స్థానం సాధించినట్లు సుబ్బుశర్మ తెలిపారు.పదవ తరగతి అభ్యసిస్తూ చిన్న వయసులో వేదాలపై పట్టు సాధించిన మహాన్యాస్ ను మండల ప్రజలు అభినందించారు.

## ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

వరదయ్యపాలెం, మార్చి 14, ప్రభాతవార్త



మండలంలో జనసేన నాయకులు, టీడీపీ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. సందర్భంగా జెండా ఆవిష్కరించి కేక్ కటింగ్ చేసారు. అనంతరం ఏయిమ్ ఫార్ సేవా ఆశ్రమం నందు 50కిలోల బియ్యం ప్లేట్స్, నిత్యావసర సరకులు అందచేసారు. అనంతరం జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించి నేటికి 13వ సంవత్సరాలు జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిజాయతీ సమాజంలో మార్పు కోసం నిరంతరం ప్రజల సమస్యలే ధ్యేయంగా ప్రజలకు అండగా నిలబడుతున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జానకిరామయ్య, విజయ్ కుమార్, శ్రీను, శ్రీధర్, దొడ్డి శేఖర్, రెడ్డి శేఖర్, సాగర్, చిరంజీవి, లోహిత్, సాయి, టీడీపీ నాయకులు టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల్ కుమార్, నూతల పార్టీ శ్రీను నాయుడు డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు, భవన నిర్మాణ కార్మిక నాయకుడు కోటి, బీజేపీ మండల అధ్యక్షులు దిలీప్ రాయల్, బిజెపి నాయకులు ఓబీసీ మోర్చా డిస్టిక్ కార్యదర్శి మురళి, మాజీ మండల అధ్యక్షులు వేలూరుపురుషోత్తం, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో నూకతోటి రాజేష్

వరదయ్యపాలెం, మార్చి 14, ప్రభాతవార్త



మండలంలోని జామియా మసీదులో శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందుకు వైసీపీ నియోజవర్గ ఇంచార్జి నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసీపీ చేనేత విభాగ సంయుక్త కార్యదర్శి బొప్పన తిలక్ బాబు, మైనారిటీ నాయకుడు అబ్దుల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ముస్లింల పవిత్ర మాసమైన రంజాన్ పండుగ మాసంలో ముస్లింలు అందరూ అల్లా కృపకు పాత్రులై ఆనందంగా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నుకతోటి రాజేష్, బొప్పన తిలక్ బాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు నాయుడు దయాకర్ రెడ్డి, ఎస్సీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ సియల్‌ఎన్ పల్లి సర్పంచ్ దుడ్డు వేణు, కాంబాక్కం సర్పంచ్ దీప నరేంద్ర, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సామర్లహరి, పాత్రికేయులు రియాజ్, యూత్ కన్వీనర్ లోకేష్, స్థానిక నాయకులు బొప్పన రమేష్ శివ, బీఎన్ కండ్రిగ గురునాథం, ముస్లిం మైనారిటీ మత పెద్దలు వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ షేక్ సిరాజ్ బాషా, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ సభ్యుడు షేక్ అబ్దుల్ కో ఆప్షన్ మెంబర్ సిద్ధిక్, సలావుద్దీన్, కబీరుల్లా, ఇషాక్,ఫిరోజ్ ఖాన్, గయాస్, షఫీ ఉల్లా, ఇనాయతుల్లా, అంజిద్ భాష, జాకీర్, మన్సూర్, ఆశిక్, ఇస్మాయిల్, షహీద్, జాఫర్, ఖాజా మొహిద్దిన్, నాగూర్ భాయ్, మత పెద్దలు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కడూరు చెరువు నీటి పారుదల చైర్మన్ రమేష్ రెడ్డి

వరదయ్యపాలెం, మార్చి 14, ప్రభాతవార్త



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి, యువనేత నారా లోకేష్‌ను కడూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, కడూరు చెరువు నీటి పారుదల చైర్మన్ రమేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై ఆయన మంత్రితో చర్చించారు. వరదయ్యపాళెం నుండి తడ వరకు ఉన్న ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతిన్నందున, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ మార్గంలో రాకపోకలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు అవసరమైన చోట హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. స్థానిక సాగునీటి వనరుల పటిష్టత, రైతుల సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## మాధనపాళెం గ్రామంలో శ్రీసిటీ డీఎస్పీ బృందం కార్డెన్ సెర్చ్

సత్యవేడు, మార్చి 14 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం మాధనపాళెం గ్రామంలో శ్రీసిటీ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు శనివారం వేకువ జామున శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐలు ప్రియాంక, సుధీర్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు బృందం మాధనపాళెం గ్రామాన్ని చుట్టు ముట్టి అనువణువు గాలిస్తూ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని 102 ఇళ్ళలో తనిఖీలు చేసి ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులకు గంజాయి, రోడ్డు భద్రత, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు వంటి పలు అంశాలపై శ్రీసిటీ డీఎస్పీ అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలన్నారు. 18 సంవత్సరాల లోపు మైనర్స్‌కి ద్విచక్రవాహనాలను నడపడానికి ఇవ్వడం నేరమన్నారు. ఎవరైనా అపరిచితుడు గ్రామంలో తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పూనుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

రామకుప్పం, మార్చి 14 ప్రభాతవార్త



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామకుప్పంలో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. బందార్లపల్లి సర్కిల్‌లో జనసేన పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి పంచారు. నేతలు మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రజాసేవ కోసం ముందుకు వచ్చారన్నారు. ఈసందర్భంగా పదిమంది జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు హరీష్, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు ఆనందరెడ్డి, నరసింహులు, పవన్, భాస్కర్, శ్రీకాంత్, గంగాధర్, వినోద్, గజే ంద్ర, సురేష్, వెంకటాచలం, బాలరాజు, మంజునాథ్, రాజసింహ, ఆనందప్ప పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కోసమే ఫుడ్‌బాస్కెట్

శాంతిపురం, మార్చి 14 ప్రభాతవార్త

మహిళల ఆరోగ్యం కోసమే సిఎం చంద్రబాబునాయుడు ఫుడ్‌బాస్కెట్ కార్యక్రమంకు శ్రీకారం చుట్టారని రెస్కో డైరెక్టర్ బసవరాజు పేర్కొన్నారు. శనివారం పిల్లిగానిపల్లి గ్రామంలో సెర్ప్, రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా ఆర్గానిక్ పంట దినుసులకు మహిళలకు పంపిణీ చేశారు. డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఫుడ్ బాస్కెట్ ద్వారా చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నేతలు మణి, కుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు సర్వంసిద్ధం

చిట్వేలి, మార్చి 14, ప్రభాతవార్త :



మార్చి 16 సోమవారం నుంచి నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధంగా ఉన్నాయని విద్యాశాఖ అధికారులు ఖాజా మొయిద్దీన్, ఈశ్వరయ్యలు తెలిపారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఏ సెంటర్ నందు 187, బి సెంటర్ లో 180, సి సెంటర్ లో 146 మందితో కలిపి మొత్తం 513 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు.పరీక్ష కేంద్రం వద్ద పోలీసులరక్షణ, నీటి సౌకర్యం, అందుబాటులో వైద్యం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పరీక్షా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పర్యవేక్షిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమంలో తెలియపరిచారు. పరీక్షా కేంద్రం బయట ఎలాంటి ఇబ్బందులు కలగజేసిన, వారి మీద కఠిన చర్యలు ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శుభాశీస్సులు తెలియజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గారాజు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఉగాది పురస్కారానికి ఎంపికైన డాక్టర్ సుదర్శన్ శర్మ....



రైల్వేకోడూరు, మార్చి 14 ప్రభాతవార్త

ఈనెల 17న అనంతపురం జిల్లా స్థాయి ఉగాది పురస్కారాలకు రైల్వేకోడూరులోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, నిర్మాణ కర్త డాక్టర్ బి సుదర్శన్ శర్మ ఎంపికైనట్లు విలేకరులకు తెలిపారు. ఈనెల 17న అనంతపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మండపంలో ఉగాది పురస్కారాన్ని అందుకోబోతున్నట్లు శర్మ వివరించారు. గతంలో శర్మ నిర్వహించిన సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని అనంతపురం జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఏ ఎల్ ఎన్ శాస్త్రి ఉగాది పురస్కారానికి ఎంపిక చేసినట్లు సుదర్శన్ శర్మ తెలియజేశారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

చిట్వేలి, మార్చి 14, ప్రభాతవార్త :



వయోవృద్ధులు, దివ్యాంగుల కొరకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని, వారి సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూ ఉందని టిడిపి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల ఆన్లైన్ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక పిహెచ్సి వైద్యులు శివప్రసాద్ గౌడ్ మరియు సల్మా, పెనగలూరు పిహెచ్సి వైద్యులు తావుషీఫ్ దివ్యాంగులను పరీక్షించి వారికి అవసరమైన పరికరాలను సూచించారు. చిట్వేలి, పెనగలూరు మండలాల నుంచి సుమారు 300 మంది ట్రై సైకిల్, చేతి కర్రలు, వాకింగ్ స్టాండ్లు తదితరు ఉపకరణాలకు నమోదు చేసుకున్నట్లు స్థానిక ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో పెనగలూరు ఎంపీడీవో విజయరావు, టిడిపి సీనియర్ నాయకులు లారీ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పగడాలపల్లిలో ముస్లింలకు ఇఫ్తార్ విందు..

రైల్వే కోడూరు, మార్చి 14, ప్రభాతవార్త :



రైల్వే కోడూరు పట్టణంలోని పగడాల పల్లెలోని కౌసర్ మసీదు వద్ద ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. మసీదు పెద్దలు ఆఫీజుల్లా, షేక్ తౌయోయిబ్, రియాజ్ అహ్మద్, బషీర్ అహ్మద్, గౌస్ బాయ్, హుస్సేన్ భాయ్, ముజుఫర్ రెహమాన్, వాయిజె అహ్మద్, అమీర్ భాష, షేక్ హాఫీజ్ తోపాటు పట్టణానికి చెందిన ముస్లింలు భారీగా పాల్గొన్నారు,. ఈ సందర్భంగా ఉపవాసాల సమయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం పూర్వజన్మ సుకృతమని మసీదు పెద్దలు అన్నారు.

## ఘనంగా జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవం....

రైల్వేకోడూరు, మార్చి 14, ప్రభాతవార్త :



రైల్వే కోడూరు మండలంలోని మైసూరు వారి పల్లి పంచాయతీ రాజా నగర్ వద్ద శనివారం జనసేన రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. ఎన్నికలలో రాష్ట్ర నాయకుడికి ఇచ్చిన మాట ప్రకారం రైల్వే కోడూరులో అభ్యర్థిని గెలిపించి విజయ దుందుభి మోగించామని అన్నారు. అనంతరం జనసేన జిందాబాద్, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ భారీ నినాదాలు చేశారు.మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి, బత్తిన గంగయ్య యాదవ్, పి సి ఎన్ బ్రదర్స్, అమర్, తులసి, సారధి, కొండేటి వెంకట రమణ,సభాపతి,కొక్కంటిమహేష్‌తోపాటుకోడూరు మండలానికి చెందిన కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

# స్వర్ణముఖి నదిలో ఇసుక భారీ త్రవ్వకాలు!

**-చర్యలు తీసుకోని రెవిన్యూ, మైనింగ్, పోలీస్ ఉన్నతాధికారులు**



నాయుడుపేట, మార్చి 13 ప్రభాతవార్త: ప్రభుత్వం పేదలకు ఉచితంగా ఇసుక అందిస్తామని చెప్పినప్పటికీ అది చాలా చోట్ల అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నది తీరంలో చుట్టుపక్కల గ్రామాల్లోని కొన్ని ప్రాంతాల్లో నుంచి టాక్టర్లను ఏర్పాటు చేసుకొని అధికారుల కళ్ళు కప్పి ఇసుక, గ్రావెల్ మాఫియా రెచ్చిపోతూ అక్రమంగా రవాణా కొనసాగిస్తూనే ఉన్నారు. ముందుగా అక్రమ ఇసుక రవాణా తరలించేందుకు, ఆ చుట్టుపక్కల ప్రాంతంలోని కూలీలను ఏర్పాటు చేసుకొని టాక్టర్లకు లోడు చేసుకుని బయట ప్రాంతాలకు భారీగా తరలిస్తున్నారు. అదే క్రమంలో ఒక ట్రాక్టర్ ఇసుక 3 వేల అయితే, గ్రావిల్ 4వేల వరకు పలుకుతుండ డంతో బంగారంతో సమానం అయిపోయింది. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇసుక, గ్రావెల్, మట్టిని మేనకూరు సెజ్ కంపెనీలకు భారీగా తరలిస్తూ లక్షల్లో కాసులు కూడబెట్టుకుంటున్నారు. అంతే కాకుండా నాయుడుపేట నుండి శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, తడ, శ్రీసిటీ, ఆరంభాకం, కాకుండా ఇతర రాష్ట్రమైన చెన్నైకి భారీగా ఇసుకను తరలిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇసుక కరువు ఉండడంతో ప్రత్యేకంగా రాత్రి వేళల్లో జోరుగా తరలిస్తున్నట్లు సమాచారం. అదే క్రమంలో ఇసుక అక్రమ తరలింపులో ప్రధాన కారణం ఏంటని తెలుసుకుంటే ఇక్కడి ప్రతి ప్రాంతానికీ రాజకీయ నేతల అండదండల ప్రభావం అని ఆ పార్టీ నేతలే ఇంతకు మునుపు గుసగుసలాడుకునేవారు, ఇప్పుడు బహిరంగంగానే చర్చించు కుంటున్నారు. ఇప్పటికైనా అక్రమంగా తరలిస్తున్న ఇసుక మాఫియాకు ఉన్నత అధికారులు, సిడబ్ల్యూసి అధికారులు, మైనింగ్ అధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్ వారు అడ్డుకట్ట వేసి అక్రమ ఇసుక, గ్రావెల్ తరలింపులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని స్థానిక పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మన్నారుపోలూరు కార్డెన్ సెర్చ్



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు గ్రామంలో శనివారం ఉదయం కార్డెన్ సెర్చ్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేని పది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ వజ్రపహార్ కార్యక్రమ ంలో భాగంగా సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు అజయ్‌కుమార్, కొండప్పనాయుడు, జివి చౌదరి, శ్రీకాంత్, 35 మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ చేపట్టారు. అనంతరం రైల్వేస్టేషన్ లో, బస్టాండ్‌పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులు, చుట్టుపక్కల బంకుల్లో తనిఖీలు చేశారు. జూనియర్ కాలేజీ, బాలికల హైస్కూలు, పక్కనే ఉన్న అంగళ్లలో కూడా తనిఖీలు చేశారు. గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారం నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు సిఐ తెలిపారు. అపరిచితుల సంచారం, గంజాయి అక్రమ అక్రమాలపై తమ ఆపరేషన్ కొనసాగుతుందని, నెలరోజులు పాటు పూర్తిగా దీనిపైనే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. జనసేన పార్టీ నాయకులు మాబాషా మాట్లాడుతూ పవన్ కల్యాణ్ ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు పనిచేస్తారని తెలిపారు. అలాగే ఏపి టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతల ఆవుల రమణ, షేక్ మాబాషా, నక్కా హరిబాబు, శంకు సురేష్, ఆవుల దాస్, సూరి, ప్రవీణ్, హరి, మహిళా నేతలు పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌కు శ్రీహరికోట ఎస్ఐ



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: సూళ్లూరుపేట పోలీసు సర్కిల్ పరిధిలోని శ్రీహరికోటలో ఎస్ఐగా పనిచేస్తున్న నాగబాబును విఆర్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి శనివారం ఆదేశాలు అందాయి. పరిపాలనపరమైన కారణాలతో ఎస్ఐని తక్షణమే రిలీవ్ అయి ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవం



నాయుడుపేట, మార్చి 14 ప్రభాతవార్త: నాయుడుపేటలోని నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయం ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ వ్యవస్థాపకులు, మన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి రాష్ట్ర భవిష్యత్తు కొరకు జనసేన పార్టీని స్థాపించి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికుల సమక్షంలో పార్టీ జండాని ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుక లని ప్రారంభించిన్న సూళ్లూరుపేట నియోజకవర్గ ఇంచార్జి నాయుడుపేట ఏఎంసిఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ జనసేన శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న అనంతరం పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పార్టీలో తమ తమ అనుభవాల గురించి జనసేన నాయకులు, వీరమహిళలు, జనసైనికులు చర్చించుకున్నారు. పార్టీ స్థాపించిన రోజు నుండి నేటి వరకు పవన్ కళ్యాణ్ వెంట నడుస్తూ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేసిన పవనన్న సైనికులందరికీ ఉయ్యాల ప్రవీణ్ కృతజ్ఞతలు తెలియజేసారు. సమావేశం అనంతరం జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణ రావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, సూళ్లూరుపేట నియోజకవర్గం జనసేన శ్రేణులు అందరు కలిసి విందులో పాల్గొన్నారు.

## కవయిత్రి మొల్లమాంబ జయంతి



సూళ్లూరుపేట, మార్చి 14 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా ఓబిసి మోర్చా ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల మాంబ జయంతిని శనివారం బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి కులంలో జన్మించి మొల్ల రామాయణాన్ని రచించిన ఆమెను బడుగు బలహీన వర్గాల వారు స్ఫూర్తిగా తీసుకో వాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి కోరారు. అనంతరం ఆమె చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బెజవాడ విజయమ్మ, నూతలపాటి శ్రీనివాసులు, వాసు కుమార్ గౌడ్, దుర్గి రమేష్, జి.సురేఖ, దివ్యశ్రీ, ఎంఎం పద్మజ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో అపోలో హాస్పిటల్స్ నూతన కేంద్రం

**-ఆధునాతన రోబోటిక్ చికిత్సను బలోపేతం చేసిన అపోలో**




తిరుపతి హెల్త్, మార్చి 14 ప్రభాతవార్త: అపోలో హాస్పిటల్స్ చెన్నై, తిరుపతి ప్రాంతానికి చెందిన రోగులకు అధునాతన ఆరోగ్య సంరక్షణ సదుపాయాలను నిరంతరం బలోపేతం చేస్తోంది. గత దశాబ్దంలో ఈ ప్రాంతానికి చెందిన 1.5 లక్షలకు పైగా రోగులు ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్సను పొందారని నిర్వాహకులు తెలిపారు. రోగులకు ఇంటికి దగ్గరగా మరింత సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు, అపోలో హాస్పిటల్స్ తిరుపతిలోని టాటా నగర్, కొర్లగుంట రోడ్డులో నూతన కేంద్రాన్ని ప్రారంభిస్తోందన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా తిరుపతి నివాసితులకు ఆరోగ్య శిబిరాలు, కన్సల్టేషన్లు అందించబడతాయన్నారు. క్లినికల్ నైపుణ్యం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సంరక్షణకు గుర్తింపు పొందిన అపోలో హాస్పిటల్స్ చెన్నై, తిరుపతి ప్రాంతానికి చెందిన రోగులకు విశ్వసనీయ రిఫెరల్ కేంద్రంగా అవతరించిందన్నారు. న్యూరాలజీ, థొరాసిక్ సర్జరీ, ఆంకాలజీ, కార్డియాలజీతో పాటు అనేక అతి తక్కువ ఇన్వాసివ్ విధానాలు అవసరమయ్యే సంక్లిష్ట ప్రత్యేకతలలో చికిత్స కోసం తిరుపతి ప్రాంత రోగులు ఈ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. అపోలో హాస్పిటల్స్ చెన్నై నుండి సీనియర్ నిపుణులు ప్రతి వారం తిరుపతిని సందర్శిస్తూ అక్కడి రోగులకు నిరంతర వైద్య సంరక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు నిపుణుల కన్సల్టేషన్లు, వ్యక్తిగత చికిత్స ప్రణాళికలు, తదుపరి ఫాలోఅప్ సంరక్షణను అందిస్తారని వివరించారు. ఈ విధానం ద్వారా రోగులు సకాలంలో వైద్య మార్గదర్శకత్వాన్ని పొందడంతో పాటు, అవసరమైనప్పుడు అధునాతన వైద్య విధానాల కోసం సమన్వయంతో కూడిన సిఫార్సులను కూడా పొందగలుగుతున్నారని తెలపారు. అపోలో హాస్పిటల్స్ చెన్నై, రోబోటిక్ సహాయక మరియు అతి తక్కువ ఇన్వాసివ్ శస్త్రచికిత్స సాంకేతికతల స్వీకరణలో ముందంజలో నిలుస్తూ, బహుళ ప్రత్యేకతలలో చికిత్స ఫలితాలను మెరుగుపరుస్తోంది అన్నారు. ఈ అధునాతన పద్ధతులు శస్త్రచికిత్స నిపుణులకు మరింత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్సలు నిర్వహించే అవకాశం కల్పించడమే కాకుండా, రోగులకు గాయాలు మరియు నొప్పి తగ్గి, త్వరగా కోలుకునే అవకాశాన్ని కూడా అందిస్తాయని అన్నారు. డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్, సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజీ అండ్ న్యూరోసైకియాట్రీ, అపోలో హాస్పిటల్స్, చెన్నై ఇలా అన్నారు. దీర్ఘకాలిక సమస్యలను నివారించడానికి న్యూరోలాజికల్ పరిస్థితులకు తరచుగా ముందస్తు రోగ నిర్ధారణ, ప్రత్యేక సంరక్షణ అవసరం. తిరుపతి ప్రాంతానికి చెందిన రోగులకు నిపుణుల కన్సల్టేషన్లను విస్తరించడం ద్వారా, సకాలంలో నరాల సంబంధిత మూల్యాంకనాన్ని అందించడంతో పాటు అవసరమైనప్పుడు అధునాతన చికిత్సకు ప్రాప్యతను నిర్ధారించవచ్చు అని తెలిపారు. ఇది రోగుల చికిత్స ఫలితాలను గణనీయంగా మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. డాక్టర్ అజయ్ నరసింహన్, కన్సల్టెంట్ థొరాసిక్ సర్జన్, అపోలో హాస్పిటల్స్ చెన్నై ఇలా తెలిపారు. అతి తక్కువ ఇన్వాసివ్, రోబోటిక్ పద్ధతులను అవలంబించడం వల్ల థొరాసిక్ శస్త్రచికిత్సలో ఫలితాలు గణనీయంగా మెరుగుపడ్డాయన్నారు. ఈ సాంకేతికతలు సంక్లిష్టమైన ఊపిరితిత్తులు మరియు ఛాతీ సంబంధిత విధానాలను మరింత ఖచ్చితత్వంతో నిర్వహించేందుకు సహాయపడతాయన్నారు. అలాగే రోగులు వేగంగా కోలుకుని త్వరగా సాధారణ జీవితానికి తిరిగి చేరుకునే అవకాశాన్ని కల్పిస్తాయని వివరించారు. ఇంటిగ్రేటెడ్ కేర్ మోడల్ ద్వారా అపోలో హాస్పిటల్స్ చెన్నై, ప్రాంతీయ ప్రాప్యత, అధునాతన ఆరోగ్య సంరక్షణ మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తూ ముందుకు సాగుతోందన్నారు. దీంతో తిరుపతి ప్రాంతానికి చెందిన రోగులు తాజా వైద్య ఆవిష్కరణలు మరియు నిపుణుల నైపుణ్యాల ప్రయోజనాలను పొందగలుగుతున్నారి వారు తెలిపారు. క్లినికల్ ఎక్సలెన్స్, ఖచ్చితమైన సాంకేతికత మరియు రోగిమొదటి ప్రాధాన్యతగా పొందే ఫలితాలపై బలమైన దృష్టితో, అపోలో హాస్పిటల్స్ చెన్నై అన్ని వర్గాల ప్రజల జీవితాలను స్పృశిస్తూ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడానికి కట్టుబడి ఉందన్నారు. అపోలో హాస్పిటల్స్‌ను డాక్టర్ ప్రతాప్ రెడ్డి చెన్నైలో మొదటి ఆసుపత్రిని ప్రారంభించినప్పుడు, అపోలో హాస్పిటల్స్ ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిందని. మరింత సమాచారం కోసం అపోలో హాస్పిటల్స్ ఎస్. బాలాజీ 9444040006 సంప్రదించాలన్నారు.

## యుద్ధంతో గ్యాస్ వినియోగదారులపై తీవ్ర వత్తిడి

గృహ వినియోగ గ్యాస్ సిలెండర్ రూ.2 వేలు-వాణిజ్య వినియోగ గ్యాస్ రూ.3 వేలునల్ల బజారు గ్యాస్ ధరలతో సామాన్యుడు విలవిల-ప్రభుత్వ వసతి గృహాలకు ఒక్క సిలెండర్ మాత్రమే



చంద్రగిరి, మార్చి 14 ప్రభాతవార్త: ఇరాన్ యుద్ధ ప్రభావం భారతీయ కుటుంబాలపై తీవ్ర వత్తిడిని పెంచుతున్నది. యుద్ధం మొదలైన నాటి నుండి కొంత మంది పెట్రోడీజిల్ గ్యాస్ ధరలు పెరుగుతాయనీ, కొరత ఏర్పడ వచ్చనే సంకేతాలను దావానంలా వ్యాపింపజేశారు. దీంతో ప్రతి కుటుంబం తమకు అవసరం లేకపోయినప్పటికీ ఎన్ని కనెక్షన్లు వుంటే అన్నింటినీ వేర్వేరుగా బుక్ చేసుకుని సిలెండర్లు ముందు జాగ్రత్తగా దాచుకుంటున్నారు. ఇక్కడే అసలు ట్విస్ట్ వుందనే సామాన్యుడి ఆరోపణ గ్యాస్‌కు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో పండుగ చేసుకోవాలనే కొంత మంది దురాశ కారణమంటు న్నారు. ప్రస్తుతం నల్లబజారులో గృహ వినియోగ సిలెండర్ ధర రూ.2 వేలు కాగా వాణిజ్య సిలెండర్ ధర రూ.3 వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. పరిస్థితి ఇలానే కొనసాగితే సన్న చిన్న హోటల్, టీ షాపుల వాళ్ళు తమ దుకాణాలను మూసివేయాల్సిందనే అభిప్రాయానికి దాదాపు వచ్చినట్లు చెబుతున్నారు. గృహ వినియోగ గ్యాస్ కొరకు వినియోగదారుడు బుక్ చేసుకుందామని ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవడం లేదంటున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం పదే పదే చెబుతున్నప్పటికీ చంద్రగిరిలో మధ్యాహ్న భోజన పథకానికి, ప్రభుత్వ వసతి గృహాలకు కోరినన్ని సిలెండర్లు సరఫరా చేయాలని స్పష్టంగా ఆదేశాలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుతం ఒక సిలెండర్ మాత్రమే ఇస్తున్నట్లు తెలిసింది. తిరుపతిలో వసతి గృహాలకు కోరినన్ని సిలెండర్లు ఇస్తున్నా చంద్రగిరిలో హాస్టల్స్‌కు, మిడ్ డే మిల్స్‌కు కేవలం ఒక సిలెండర్ ఇవ్వడం ఏ సమయంలో గ్యాస్ అయిపోతుందో అనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తున్నది. చంద్రగిరిలో సగటున రోజుకు ఎన్ని కనెక్షన్లు బుక్ చేస్తున్నారు, ఎన్ని సిలెండర్లు కంపెనీ నుండి ఇక్కడికి పంపిస్తున్నారు, ఎంత మంది వినియోగదారులకు సకాలంలో సగటున రోజుకు డెలివరీ ఇస్తున్నారు, ఎంత మంది నిరీక్షిస్తున్నారనే అంశాలను ఆయా ఏజెన్సీల వద్ద, గోడౌన్ల వద్ద నోటీసు బోర్డులో పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. గ్యాస్ సరఫరాలో ఏర్పడిన డిమాండ్‌పై ఉన్నతాధికారులు పదేపదే వదంతులు నమ్మవద్దని చెబుతున్నప్పటికీ వాస్తవంలో జరుగుతున్న పరిణామాలపై సామాన్యుడు పెదవి విరుస్తున్నాడు. వసతి గృహాలకు, మిడ్ డే మిల్స్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని చెప్పినట్లు మండల సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ సురేంద్ర తెలిపారు. గ్యాస్ బుకింగ్‌లు విపరీతమైన వత్తిడికి గురికావడంతో గ్రామీణ ప్రాంతాలలో కనీసం 45 రోజులు, పట్టణ ప్రాంతాలలో 25 రోజులు వేచి చూసే విధంగా కేంద్ర ప్రభుత్వమే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బ్లాక్‌లో సిలెండర్ల విక్రయాలపై సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## సప్తకనికలమ్మ ఆలయం నుంచే రాజకీయప్రస్థానం

**- దేవస్థాన పాలకమండలి ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్**



చిత్తూరురూరల్, మార్చి 14 ప్రభాతవార్త: చిత్తూరునగరం, దొడ్డిపల్లిలోని శ్రీసప్తకనికలమ్మ దేవాలయంలో మొట్ట మొదటగా పూజ కార్యక్రమాలు నిర్వహించి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. శనివారం శ్రీ సప్తకన్నికలమ్మ దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీ కార మహోత్సవానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలసి పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో చిత్తూరు ప్రజల ఆదరణతో ఎమ్మెల్యేగా గెలిచానని, దొడ్డిపల్లిలోనే ఇల్లు నిర్మించుకుంటు న్నానని, ఇకపై మా ఊరిదేవత కూడా శ్రీ సప్తగిరి కనికలమ్మేనని పేర్కొన్నారు. అనంతరం పాలకమండలి ఛైర్మెన్‌గా బాలాజీ, ఇతర సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ త్యాగరాజన్, సభ్యులు గోపాలక్రిష్ణ, నాయకులు వెంకటేష్‌యాదవ్, నళిని, తిరుకుమరన్, నాగరాజు, తెదేపా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గణనాధుడిని దర్శించుకున్న పలువురు హైకోర్టు జడ్జిలు



కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామిని పలు రాష్ట్రాల హైకోర్టు జడ్జిలు శనివారం దర్శించుకున్నారు. ఈ మేరకు కేరళ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ పిఎం మనోజ్, కర్నాటక రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఇఎస్ ఇంద్రేలు వేరు వేరుగా కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరిటెండెంట్‌లు వాసు, కోదండపాణి, అర్చకులు ఆలయ రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు కోర్టు సిబ్బంది, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## 2 రోజుకు చేరిన నాన్ ఆఫ్కాస్ కార్మికుల రిలే దీక్షలు



నాయుడుపేట, మార్చి 14 ప్రభాతవార్త: మున్సిపాలిటీలో పారిశుద్ధ్య విభాగంలో నాన్ ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు 8నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట మున్సిపల్ ఆఫీస్ ముందు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డీపల్లి చెంగయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుంద మాట్లాడుతూ గత 8 నెలలగా జీతాలు రాకపోవడంతో ఆ కుటుంబ సభ్యులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలుమార్లు కమిషనర్ను కలిసిన అర్జీలు ఇచ్చిన పట్టించుకోకపోవడంతో మున్సిపాలిటీ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలకు దిగాల్సి వచ్చిందని అన్నారు. వాహనాలు కండిషన్లో లేవని, సేఫ్టీ పరికరాలు ఇవ్వడం లేదని అన్నారు. నియంతలాగా వ్యవహరిస్తున్న కమిషనర్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అన్నారు. సీనియార్టీ ఉన్న కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. కరోనా కాలం నుండి పనిచేస్తున్న కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, అనిల్, అజయ్, వాసు, రమణయ్య, రమణమ్మ, వెంకటసుబ్బయ్య వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చర్యలు : ఎంపీపీ తంబిరెడ్డి



వెంకటగిరి, మార్చి 14 ప్రభాతవార్త : వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తంబిరెడ్డి తనుజరెడ్డి అధికారులను ఆదేశించారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామాల్లో చెడిన బోర్లను వెంటనే బాగు చేయించాలని సూచించారు. తాగునీటి సరఫరా ఉపయోగించే మోటర్లు చెడిపోతే వెంటనే బాగు చేయించాలని సూచించారు. తాగునీటి సమస్య ఎక్కడున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సిడిపిఓ శంషాద్ బేగం మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పోష్టికార ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు చేయించరాదని సూచించారు. బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి ఘనంగా ఈ సందర్భంగా సత్కరించారు. సమావేశంలో ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ లు బాబురావు, వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో రాజీనే రాజ మార్గం

**- జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ**



వెంకటగిరి, మార్చి 14 ప్రభాతవార్త : లోక్ అదాలత్‌లో కేసులు రాజీ పడినవారు కలిసిమెలిసి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. వెంకటగిరి లోని జూనియర్స్ జడ్జి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా కేసులు రాజీ పడాలని సూచించారు. కేసుల్లో రాజీ పడడమే రాజీమార్గమని తెలిపారు. కేసుల్లో రాజీ పడినవారు కక్షలు పెంచుకోకూడదని సూచించారు. కోర్టులో జరిగిన మెగా లోక్ అదాలత్‌తో 4214 కేసులు రాజీ చేశామని తెలిపారు. పలు కేసుల్లో కోటి 14 లక్షల 50 వేల 618 రూపాయలు కట్టించామని చెప్పారు. ముందుగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు రాజేష్, సిఐ ఏవి రమణ, ఎస్సైలు ఏడుకొండలు, గోపి, శివశంకర్, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, మురళీకృష్ణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వరం ఇంద్ర ధనస్సు పథకం

**- మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు**



వెంకటగిరి, మార్చి 14 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కోసం దివ్యాంగులపథకం దివ్యాంగులకు ఒక వరం మాజీ ఏఎంసీ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు తెలిపారు. వెంకటగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంద్ర ధనస్సు పథకం ద్వారా దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దివ్యాంగుల్లోకు వైద్య పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, మూడు చక్రాల బైకులు, తదితర పరికరాలు అందిస్తారని తెలిపారు. వైద్య పరీక్షల కోసం వచ్చిన దివ్యాంగులకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, మేనేజర్ సాంబశివయ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు మురళి గౌడ్, రాపూర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ కోత

వెంకటగిరి, మార్చి 14 ప్రభాతవార్త: పట్టణంలోని పాల కేంద్రం వద్ద ఉన్న 132 కెవి సబ్ స్టేషన్ నందు మరమ్మతులు కారణంగా ఈనెల 14వ తేదీ వెంకటగిరి టౌన్, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాలలో విద్యుత్ కోత విధిస్తున్నట్లు డిఈఈ సీనయ్య తెలిపారు. వెంకటగిరి సబ్ సస్టేషన్ నందు మరమ్మత్తులు కారణంగా రేపు ఉదయము 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంట వరకు తాత్కాలిక విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలియజేశారు. దీంతో మూడు మండలాలలోని ప్రజలు గృహ అవసరాల నిమిత్తం ముందస్తు జాగ్రత్తగా నీటి నిల్వలు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అందరూ కూడా ఈ అసౌకర్యానికి సహకరించవలసినదిగా తెలియచేశారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

**- టిడిపి మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి**

వాకాడు, మార్చి 14 ప్రభాతవార్త: రైతులు ఖాతాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 6000 వేల రూపాయలు రైతులు ఖాతాలో వేయడంతో రైతులు కళ్ళల్లో ఆనందంతో పాటు, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తుందని టిడిపి మండల కన్వీనర్ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో ప్రకటన ద్వారా తెలియజేస్తూ ముఖ్యమంత్రి సూపర్ సిక్స్ పథకాలలో చెప్పిన విధంగా చెప్పినట్టు చంద్రబాబునాయుడు చేస్తున్నారన్నారు. రైతులకు ధాన్యం గిట్టుబాటు ధర కల్పించారన్నారు. రాష్ట్రంలోని మహిళలకు వారి జీవనాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా మండలంలోని ప్రభుత్వం రైతుసేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, రైతుల ందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులు నమ్మి రైతులు మోసపోవద్దని సూచించారు.

## నైనిషారణ్యం పీఠం హిందు ధార్మిక సేవా సమితి వ్యవస్థపకులు



కాణిపాకం, మార్చి 14 ప్రభాతవార్త: నైనిషారణ్య పీఠం హిందు ధార్మిక సేవా సమితి వ్యవస్థాపకులు బాల బ్రహ్మానంద సరస్వతి శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన స్వామిజీకి ఆలయ ఇఒ ఎ.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం స్వామిజీ స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అనంతరం అనుబంధ ఆలయాలైన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేద మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాన ఆలయంలోని కళ్యాణ వేదిక నందు శ్రీగణేష పురాణం ప్రవచనాలను చేశారు. ఈ కార్యక్రమంలో సూపరిటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

## నేడు అప్పలాయగుంటలో కల్యాణోత్సవం

వడమాలపేట, మార్చి 14 ప్రభాతవార్త: వడమాలపేట మండలం అప్పలాయ గుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి వేణుగోపాల్ తెలిపారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం ప్రతినెల అదే రోజు స్వామివారి కల్యాణం అప్పలాయగుంటలో నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. ఈ కల్యాణోత్స వంలో పాల్గొన్న దాలచిన దంపతులు 300 రూపాయలు టికెట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. దంపతులు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని, దంపతులు ఆలయ సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలకు ఇఫ్తార్ విందు

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త



పెద్ద మసీదుకు చెందిన యువకులచే జామియా మస్జిద్‌లో ఉపవాసదీక్షలు పాటించే వారికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసారు. రంజాన్‌మాసంలో ఉపవాసదీక్షలు పాటించే వారికి సేవలందించటంలో యువజన కమిటి 30 రోజులు సేవలందించటం జరుగుతుంది.పట్టణంలోని మసీదుల్లో జయరామారావు వీధిలోని జామియా మస్జిద్ పెద్ద మసీదుగా ఉంది.ఇక్కడ ప్రతి రోజూ వందలాదిమంది నమాజులు ఆచరిస్తారు.ఈ నేపధ్యంలో శుక్రవారం ఈ ప్రాంతానికి చెందిన యువకులు కలసి 'ఇఫ్తార్‌విందు'ను ఏర్పాటు చేసారు. భక్తి శ్రద్ధలతో నమాజులను ఆచరించి ఉపవాసదీక్షలు పాటించిన వారికి ఆష్‌తో పాటు బిరియాని అందించారు. రంజాన్‌మాసంలో ఒక పుణ్య కార్యక్రమం ఆచరిస్తే 70రెట్లు పుణ్యం అధికంగా వస్తుందని చెబుతారు. ఈ నేపధ్యంలో మసీదువీధిలోని యువకులు,మైనారిటి యువ నాయకుడు గోరా సారధ్యంలో సమావేశం అయి 'ఇఫ్తార్ విందు'ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో గోరా, శ్రీకాళహస్తి ఖాజీ మున్నాభాయ్,యువకులు తమీమ్,సాజిద్,షబీరుల్లా,సర్ధార్,మిర్జాంవలి, నూరు, అమాన్, చోటా,సారు,సులేమాన్,ఉస్మాన్,అల్తాఫ్,మహమ్మద్ ఖాజీ సాహెబ్‌మున్నాభాయ్, ఉమర్,మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా,గఫూర్ తదితరులు సహాకరించారు.

## అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త



సమాజంలోని గ్రామీణాభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో కూటమి ప్రభుత్వం చూపుతుందని తెలుగుదేశం నాయకులు వివరించారు. శనివారం తెలుగుదేశం నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. పంట పొలాల్లో పని చేస్తున్న రైతులను కలసి సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు,రెడ్డివారి గురువారెడ్డి, గుమ్మడి దశరధాచ్చారి,ఉమేషరావులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌డియే ప్రభుత్వం అండగా ఉందన్నారు.గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఎన్నికల పర్యటనలో భాగంగా అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ముందడుగు వేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకంను అమలు చేస్తున్నారన్నారు. మూడోవిడత గా అన్నదాతల ఖాతాల్లో రూ.6వేలు జమకావటంతో అన్నదాతల కుటుంబాల్లో ఉగాది సంబరాలు,సంతోషాలు కనబడుతుందని వివరించారు. ఏడాదికి రైతన్నలకు ఎన్‌టియే ప్రభుత్వం రూ.20వేలు జమచేయటం రైతన్నల పట్ల ప్రభుత్వాలకు గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగా నాయకులు పంటపొల్లాల్లో రైతులతో కలసి ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు డెప్యూటి ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం జరిపారు. 2025-26 సంవత్సరానికి రూ.8,985.41కోట్లు అందించిన ఘనత ఎన్‌టిఏ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.6,560.18కోట్లు ఉందని వివరించారు. మీడియా సమావేశంలంఠ గ్రంధాలయ సంస్థ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మరో కార్యదర్శి గుమ్మడి దశరధాచ్చారి, మాజీ వైస్ చైర్మెన్ మిన్నల్‌రవి, యం.సుబ్బయ్య, డాక్టర్ యం.ఉమేష్‌రావు, వజ్రం కిషోర్, తీర్థం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ డెంటల్ కేర్ ప్రారంభించిన మేయర్ డా. శిరీష

తిరుపతి హెల్త్, మార్చి 14, ప్రభాతవార్త

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన సాగర్ డెంటల్ కేర్ (ఆర్థో డెంటిక్ సెంటర్ )ను తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష శనివారం ప్రారంభించారు. స్థానిక రెడ్డి రెడ్డి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆసుపత్రి వద్ద ప్రముఖ ఆర్తో డెంటల్ సర్జన్, సాగర్ డెంటల్ కేర్ యజమాని డాక్టర్ వి. లక్ష్మి సాగర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటికే అనేక దంత వైద్యశాలలో ఉన్నాయని, కానీ నగరాలకే పరిమితమైన ఆర్థో డెంటల్ కేర్ ను తిరుపతి వాసులు కొందుబాటులోకి తీసుకురావాలని ఉద్దేశంతో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామన్నారు. అత్యధిక పద్ధతిలో, సరికొత్త సాంకేతిక వైద్య పరికరాలతో అత్యంత నాణ్యమైన ఆర్థోడ్ డెంటల్ చికిత్సను, అందరికీ అందుబాటులో ఉంచామన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, వైద్య సిబ్బంది ద్వారా అత్యంత ప్రమాణాలతో కూడిన వైద్యం అందిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో ఎన్ఏబిహెచ్ ప్రమాణాలు పాటిస్తూ, రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దంత సమస్యలు ఉన్నవారు తమ మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీష్, తిరుపతి డిప్యూటీ మేయర్లు ఆర్ సి ముని కృష్ణ,ముద్రనారాయణ,డాక్టర్‌గురవయ్య,పలువురు వైద్యులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## శివనాథపురంలో పోలీసులు కార్డెన్ సెర్చ్

తొట్టంబేడు మార్చి 14 ప్రభాతవార్త



జిల్లా ఎస్‌పి ఆదేశాలతో శ్రీకాళహస్తి డివిజన్‌లోని పోలీసులు విస్తృత తనిఖీలతో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. నిత్యం పరిశీలనలు జరుపుతున్నారు. పరిశీలనలు జరిపిన ప్రతి సారి వందలాది అక్రమ కేసులు వారికి దొరుకుతున్నాయి.ఈ నేపధ్యంలో శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని శివనాథపురం గ్రామంలో డీఎస్పీ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పోలీసుయంత్రాంగం కార్డ్ అండ్ సెర్చ్ కార్యక్రమాలను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వజ్రపహర్' కార్యక్రమంలో భాగంగా పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. ప్రతి శనివారం నిర్వహించే ఈ కార్డెన్ సెర్చ్ లో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 52 స్కూటర్లు, 4 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులతో కలిసి మాదకద్రవ్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వలన కలిగే అనర్ధాలను గురించి వివరించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి నరసింహమూర్తి మాట్లాడుతూ పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు నిగా ఉంచాలని పిల్లలు ఏది కోరితే అవి తీసేయటం అలాంటి పనులు చేయకుండా పద్ధతిగా పెంచాలన్నారు.ఎలాంటి అసాంఘిక మత్తు పదార్థాలు క్రయవిక్రయాల గురించి1972, 112 నెంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు తిమ్మయ్య, ఇబ్రహీం, నాగరాజు, ప్రకాష్, ఎస్సైలు వెంకటేష్, రవి, సుబ్బారెడ్డి, జ్యోతి, బి.బాలకృష్ణ, ఇమ్మానుయేల్, హరి ప్రసాద్, స్వాతి, రామాంజనేయులు, ప్రత్యేకంగా వచ్చిన ఈగల్ టీం,గోవిందు 40 మంది కానిస్టేబులు, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులచే జనసేన సంబరాలు

తొట్టంబేడు,మార్చి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని జనసేన పట్టణ అధ్యక్షుడు తొటగణేష్ సారధ్యంలో పట్టన నడిబొడ్డులోని అన్నా క్యాంటిన్ సర్కిల్‌లో శనివారం ఉదయం భవన నిర్మాణ కార్మికుల భాగస్వామ్యంతో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సాధారణ కార్మికులచే పార్టీ జెండాను ఆవిష్కరింపజేసారు. కేక్ కట్ చేసారు. కార్మీకులకు అల్పాహార విందును ఏర్పాటు చేసారు. జనసేన నిరుపేదల,కార్మికుల,కర్షకుల పార్టీ అని తోటగణేష్ అన్నారు. 12 సంవత్సరాలుపూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి పార్టీ ప్రవేశించిందన్నారు. గణనీయంగా సభ్యత్వం నిర్వహించినట్లు వివరించారు.ఈ కార్యక్రమాల్లో బలిజసేన అధ్యక్షుడు కుప్పాల వెంకటేష్ అనే దుమ్ము రాయల్ సిద్దులుగారి ప్రసాద్, సుబ్బారావు, నరేంద్రబాబు, రమణగారి మురళి, గిరీష్, దినేష్, అనిల్‌బాబు, తేజ,గంగాధర్, వెంకటరమణయాదవ్, వినోద్, అశోక్ వీరమహిళలు రాజ్యలక్ష్మీ, పుష్ప,మాలతి, నంద్యాల జిల్లా మంత్రాలయ జనసేన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## పంటల శరీర ధర్మశాస్త్ర వార్షిక సదస్సు నిర్వహణ

తిరుపతి విద్య, మార్చి 14 ప్రభాతవార్త.



ఆచార్య ఎన్.జీ. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో పంటల శరీర ధర్మశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 33వ వార్షిక సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సు ప్రారంభోత్సవ సమావేశానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్. శారద జయలక్ష్మి ్మ దేవి ఆన్‌లైన్ ద్వారా హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా డా. బబిత పాల్గొనగా, గౌరవ అతిథులుగా కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. రెడ్డి శేఖర్, డా. వి. సుమతి, పంటల శరీర ధర్మశాస్త్ర విభాగాధిపతి డా. సి.హెచ్. ముకుందరావు హాజరయ్యారు. విభాగాధిపతి డా. పి. లత స్వాగతం పలుకుతూ సదస్సును ప్రారంభించారు.సదస్సులో వ్యవసాయ, ఉద్యాన పంటల అభివృద్ధిలో పంటల శరీర ధర్మశాస్త్రం ప్రాధాన్యంపై బెంగళూరులోని జీకేవీకే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన డా. నటరాజ్, రాయచూర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. అమర్ గౌడ ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. బి. గోపాల్ సింగ్ రచించిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డా. లోహిదాస్, డా. డి. పద్మజ, డా. సంతోష్ నాయక్, డా. నిర్మలకుమార్‌తో పాటు అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## వేదిక్ విద్యాన్ పాఠశాల వార్షికోత్సవానికి జబర్దస్త్ కళ..

### సందడి చేయనున్న ఆది, శాంతి, దొరబాబు!

తిరుపతి విద్య, మార్చి 14 ప్రభాతవార్త.



నగరంలోని ప్రముఖ విద్యాసంస్థ వేదిక్ విద్యాన్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు రంగం సిద్ధమైంది. మొదటి వార్షికోత్సవం ను వైభవంగా నిర్వహించే ఈ వేడుకలు ప్రత్యేకంగా సాగనున్నాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా బుల్లితెర పాపులర్ కామెడీ షో జబర్దస్త్ టీమ్ సభ్యులు పాల్గొని సందడి చేయనున్నారు.బుల్లితెర తారల రాకతో రెట్టింపు ఉత్సాహం పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో జబర్దస్త్ ఫేమ్ హైపర్ ఆది, శాంతి, మరియు దొరబాబు ముఖ్య ఆకర్షణగా నిలవనున్నారు. తమదైన కామెడీ టైమింగ్‌తో, పంచ్‌లతో ప్రేక్షకులను అలరించే ఈ టీమ్ రాకతో విద్యార్థుల్లో మరియు తల్లిదండ్రుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కేవలం చదువే కాకుండా విద్యార్థులకు వినోదాన్ని, ఉత్సాహాన్ని అందించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేసింది.విభిన్న ప్రదర్శనలతో విద్యార్థులు సిద్ధంవార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించనున్న నృత్యాలు, నాటికలు , ఇతర కళారూపాలకు జబర్దస్త్ టీమ్ రాక అదనపు బలాన్ని ఇస్తోంది. ఆది తనదైన శైలిలో విద్యార్థులతో ముచ్చటించడంతో పాటు, వారిని ఉత్సాహపరిచే ప్రసంగం చేయనున్నారు.పాఠశాల చైర్మన్,కరస్పాండెంట్ మాట్లాడుతూ.. "మా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి వార్షికోత్సవం ఒక వేదిక. ఈసారి జబర్దస్త్ టీమ్ మాతో కలవడం మాకు చాలా ఆనందంగా ఉంది" అని తెలిపారు.

## యూత్ ఫెస్ట్ ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి విద్య మార్చి 14 ప్రభాతవార్త.

చెన్నై సత్యభామ యూనివర్సిటీ వేదికగా ఈనెల 10 వతేదీ నుంచి శనివారం వరకు జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్2026లో ఎస్వీయూ విద్యార్థులు అసమాన ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంతో పాటు నాల్గోవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన యూత్ ఫెస్టో దేశవ్యాప్తంగా 153 యూనివర్సిటీల నుంచి విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఇందులో జరిగిన 28 విభాగాలలో ఎస్వీయూ విద్యార్థులు మూడు ప్రధాన బహుమతులు కైవసం చేసుకున్నారని చెప్పారు. ఇందులో విద్యార్థి ప్రదీప్ క్లాసికల్ ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, క్లేవ్ మోడలింగ్లో కే తేజ మూడవ స్థానంలో నిలిచారని, అలాగే రంగోలి విభాగంలో వీరాంజలి నాల్గోవ స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రతిభ చూపి వర్సిటీ పేరుప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింప చేసిన విద్యార్థులను ఆయనతో పాటు డీఎస్‌ఒబ్ల్యూసీఏ డైరెక్టర్ బీవీ మురళీధర్ ఈ సందర్భంగా ఘనంగా అభినందించారు.

## బ్లెండర్స్ ప్రైడ్ ద వన్ అండ్ ఓన్లీ కాంపైన్

తిరుపతి విద్య మార్చి 14 ప్రభాతవార్త.

ప్రతిష్టాత్మక బ్రాండ్ బ్లెండర్స్ ప్రైడ్ తమ కొత్త ప్రచార కార్యక్రమం ద వన్ అండ్ ఓన్లీను ప్రారంభించింది. విజయం ప్రత్యేకతలోనే ఉంటుందనే సందేశాన్ని ఈ కాంపైన్ ద్వారా తెలియజేసింది.ఈ ప్రచారంలో అవంతి నాగ్రాత్ , కిరందీప్ చాహల్ , మహిక శర్మ పాల్గొన్నారు. డిజిటల్, సోషల్ మీడియా వేదికలతో పాటు దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా దేబశ్రీ దాస్గుప్తా , చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్, పెర్నాడ్ రికార్డ్ ఇండియా , మాట్లాడుతూ యువతలో ప్రత్యేకతతో విజయం సాధించాలనే స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కాంపైన్ లక్ష ్యమని తెలిపారు.

## నిత్యాన్నదాన పథకానికి కొండాపూర్ వాస్తవ్యుల విరాళం

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాదు కొండాపూర్ వాస్తవ్యులు బొర్రా సాంబశివరావు దంపతులు విరాళం అందించారు.కొండాపూర్ వాస్తవ్యులు సాంబశివరావు దంపతులు శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో భోజనం చేసారు. తరువాత ఎఇఒ మోహన్‌ను కలసి . భక్తులు రూ.1లక్ష విరాళాన్ని అందించారు. వారికి అంతరాలయ దర్శనంతో పాటు వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

**రాజమండ్రి వాసుల విరాళం:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రి వాసులు విరాళం అందించారు.శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్న రాజమండ్రికి చెందిన వోగిరాల వెంకటభరత్ కిషోర్ నిత్యాన్న దాన పథకానికి రూ.50వేల విరాళం అందించారు.వారికి ఎపిఆర్‌ఓ రవి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు.వేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## షర్మిలా పాదయాత్రలో శ్రీకాళహస్తి నాయకులు

శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి చేపట్టిన 'ఉపాధి హామా పరిరక్షణ'యాత్రలో శ్రీకాళహస్తికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంస్కరణల్లో భాగంగా రాష్ట్రంలో అమలు జరుగుతున్న ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయుటకు పూనుకున్నారని కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేపట్టింది. ఈ నేపధ్యంలో శనివారం అమలాపురం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో సాగింది.ఈ పాదయాత్రలో శ్రీకాళహస్తి నుంచి నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదర్‌రెడ్డి సారధ్యంలో కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ షర్మిలారెడ్డి చేపట్టిన యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు.ఆమె ఆందోళనతో ప్రభుత్వాలు తీసుకొచ్చిన కొత్తచట్టాలు ఒరెండు నెలలు వాయిదా వేసుకున్నారని వివరించారు.నేడు కాంగ్రెస్ నేత యాత్రకు వస్తున్న స్పందనను గమనిస్తే రాబోవు రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని దామోదర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

## మహిళలకు పౌష్టిక ఆహారం అవసరం

### ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రేవతి

రామచంద్రాపరం, మార్చి 14 ప్రభాతవార్త:



మహిళలకు పౌష్టిక ఆహారం ఎంతో అవసరమని ఐసిడిఎస్ సూపర్ వైజర్ రేవతి అన్నారు. శనివారం కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయలచెరువు, పాత కందులవారిపల్లి గ్రామాలలో టాటా ట్రస్ట్ సహకారంతో విజయవాహిణి వారి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నాటకం ద్వారా పౌష్టికాహార ఆవశ్యకతను ప్రేక్షకుల కళ్ళకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్ధాలు, చిన్న వయస్సులో గర్భధారణ వలన కలిగే దుష్ప్రరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుజన కుమారి, కళాకారుల టీమ్ లీడర్ జయరామ్, రోజారాణి, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖ అధికారులు

### పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కేవీబీ పురం, మార్చి 14 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండల పరిధిలోని మూడు ఎస్ఎస్‌సీ పరీక్షా కేంద్రాలు అంజూరు ఉన్నత పాఠశాలలో 73బీ, 45జీ, కేవీబీ పురం కళాశాలలో 81బీ, 90బీ, 96జీలలో మొత్తం 250 బాలుర, 234 బాలికలు కలిపి 484 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులకు ఫర్నిచర్, నీటి వసతి, విద్యుత్ బల్బులు సౌకర్యం వైద్య సదుపాయం, నిరంతరాయ విద్యుత్ సదుపాయాలు కల్పించారని మండల విద్యాశాఖ అధికారులు టి.లక్ష్మిపతి, రవికుమార్‌లు శనివారం వెల్లడించారు. మండలంలోని పరీక్షలకు సంబంధించిన మూడు పరీక్షా కేంద్రాలను స్వయంగా వెళ్లి పరిశీలించారు. పదో తరగతి 2026 పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పరీక్ష రోజుల్లో పరీక్షా కేంద్రానికి చుట్టు పక్కల వంద మీటర్ల పరిధిలో 144సెక్షన్ అమల్లో ఉంటుందని, తెలిపారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందే హాజరు కావాలని వారు తెలిపారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలు

విజయపురం, మార్చి 14 ప్రభాతవార్త:



జనసేన పార్టీ 13వసంవత్సర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రమైన విజయపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, విజయపురం మండలం అధ్యక్షుడు స్వామినాథన్ పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి కోసం జనసేన పార్టీ వ్యవస్థాపకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, రాజేంద్రరాజు, చెర్రీ, గోపి, శ్రీరామ్, క్రాంతి, గోవర్ధన్, దేవదాసు, ఇజ్రాయెల్, శివ, చిన్న, రాస్, జన సైనికులు పలువురు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ తోనే పలు కేసులు పరిష్కారం

సత్యవేడు, మార్చి 14 ప్రభాతవార్త:



సత్యవేడు స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం జడ్జి వెంకట నాగరాజు ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ని నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఐపీసీ కేసులు 25, చెక్‌బౌన్స్ (ఎన్ఐయాక్ట్-2, ఎక్సైజ్ 42, ఘనీసూట్ ఓఎస్ 9, ఈపీ 9, పీఎల్‌పీ బ్యాంకు 15, ప్రెట్టీ 1125 కేసులను పరిష్కరించినట్లు జడ్జి వెల్లడించారు. ఇందుకు సంబంధించి మొత్తం రూ.39,79,034లను రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్జి వెంకట నాగరాజు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం వల్ల ఇరు కక్షిదారులకు డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ లత, శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరులు, సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం, పిచ్చాటూరు ఎస్ఐలు సాయినాథ్‌చౌదరి, మల్లికార్జున్, సునీల్, న్యాయవాదులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## గృహ ఉపయోగ గ్యాస్ కొరతలేదు !

### వినియోగదారుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు పి.రాజారెడ్డి

తిరుపతి కలెక్టరేట్, మార్చి 14 ప్రభాతవార్త :



గృహ ఉపయోగ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సరఫరా సజావుగా ఉందని, డెలివరీ ప్రక్రియ మార్పు లేదు,బుకింగ్ నుండి 25 30 రోజుల మధ్యగా డెలివరీ అవుతున్నది, అవసరం లేకపోయినా వినియోగదారులు గ్యాస్ బుక్ చేయడం వల్ల పెండింగ్ ఎక్కువగా ఉంటున్నాయన్నారు.,సరఫరా సక్రంగా ఉంది కాబట్టి ఆలస్యంగా సరఫరా అవుతుంది,కొన్నిచోట్ల కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు దీన్ని అవకాశం గా తీసుకుని సిలిండర్లు నిల్వఉంచి, అనధికారంగా బ్లాక్ మార్కెటింగ్ లో అధిక ధరలకు విక్రయిస్తూన్నారు,వినియోగదారులఅవసరాలు ఆశ్రగా,అధిక ధరలకు అమ్మకానికి దారితీసింది, కొన్నిచోట్ల తెల్సిన సమాచారం మేరకు, తనిఖీలు నిర్వహించి ఆ సిలిండర్లను డి.ఎస్.ఓ స్వాధీనం చేసునితగిన చర్యలు,తీసుకోవడం జరిగినది,సరఫరా లో ఆలస్యం కావచ్చు కానీ ఆగిపోదని వినియోగదారులు గుర్తు గుర్తుంచు కోవాలని సూచించారు.

## ఎస్వీయూలో 16న ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి విద్య మార్చి 14 ప్రభాతవార్త.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉగాది కవి సమ్మేళనం, కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు అధ్యయన శాఖ మరియు"ఈ తరం కవితా వేదిక" సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.ఉదయం 10 గంటలకు తెలుగు విభాగంలోని ఆచార్య జి.ఎన్.రెడ్డి సెమినార్ హాల్లో కవి సమ్మేళనం ప్రారంభం కానుంది. ఉగాది సందర్భంగా విద్యార్థుల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించేందుకు ముందుగా పద్య పఠనం, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు కార్యక్రమం సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు.అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనతో పాటు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తక బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.ఈ మేరకు ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ రాజేశ్వరమ్మ, ఈ తరం కవితా వేదిక గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.జీ.డి. చంద్రశేఖర్, అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## గ్రాంట్ అందే వరకు... వస్తులేనా...!

తిరుపతి విద్య, మార్చి 14 (ప్రభాతవార్త: ఎస్వీయూలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు పెన్షనర్ల పరిస్థితి దయనీయంగా మారింది. మార్చి నెల 15వ తేదీ గడుస్తున్నా వేతనాలు అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీతాల కోసం అదనపు గ్రాంట్ నిధుల కోసం ప్రభుత్వానికి విన్నవించామని వచ్చిన తర్వాత చెల్లిస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉగాది పండుగ దగ్గర పడుతున్నా అదనపు గ్రాంట్ అందేవరకూ కుస్తులతో పండుగ జరుపుకోవాలా... అంటూ అధికారులను నిలదీస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం వరకు వేచిస్తామని ప్రభుత్వం నుంచి ఏలాంటి సమాచారం అందని పక్షంలో వర్సిటీ ఖాతా నుంచి వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో తదుపరి కార్యాచరణ ఉంటుందని వర్సిటీ అధికారులకు ఉద్యోగులు తేల్చిచెప్పారు.

## శ్రీవారి పాదాల చెంత...భక్తితో నగర సంకీర్తన



తిరుపతి,మార్చి 14ప్రభాతవార్త: పవిత్ర క్షేత్రమైన తిరుపతి నగరం ప్రతి శనివారం ఉదయం భక్తి తరంగాలతో మేల్కొంటోంది. తిరుపతి భజన మండలి సభ్యులు ఘనంగా నగర సంకీర్తనను నిర్వహిస్తున్నారు. శ్రీవారికి ప్రీతిపాత్రమైన శనివారం రోజు వందలాది మంది భక్తులు పాల్గొంటూ తిరుపతి వీధులను గోవింద నామస్మరణతో మారుమోగిస్తున్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి, నుదుటిపై గోవింద నామాలతో గోవిందరాజా స్వామి గుడి వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య నగర సంకీర్తన ప్రారంభమవుతుంది. గోవింద.. గోవింద.. అనే నామస్మరణతో మారుమోగే వీధులు తిరుపతి నగరాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపుతున్నాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ భక్తి పరవశంలో మునిగిపోతున్నారు. సంకీర్తన ముగిసిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగిస్తున్నారు.ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన మండలి సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, గుండాల గోపీనాథ్, కోటి మునికృష్ణ మునెప్ప గారి మునినాథరెడ్డి , నాగరాజు, వాసుదేవ రెడ్డి, పద్మనాభం, నరసింహారెడ్డి, ధనంజయ రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, మిట్టపల్లి బ్రహ్మానందం, మురళి, తొండమునాటి సుబ్రహ్మణ్యం, మధు, కన్నప్ప గారి కేశవులు, పొన్నాల జేజిరెడ్డి, పద్మావతి, ఉష, సిద్ధమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి, మునేంద్ర, కల్పన విగ్రహాల కళ్యాణి సిద్ధమ్మ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్...ఉచిత వైద్యశిబిరం




తిరుపతి,మార్చి 14ప్రభాతవార్త: తిరుపతి నరసింహ తీర్థం రోడ్డులో విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి, శ్రీనివాస సంయుక్తంగా అరవింద్ కంటి ఆస్పత్రి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 500 మందికి పైగా పాల్గొని కంటి పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు కే ఆర్ శంకర్ మాట్లాడుతూ ప్రతినెల రెండవ శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి సభ్యుడు ఉపయోగించుకోవాలని తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి ,శ్రీనివాస ఆధ్వర్యంలో ఎన్నో రకాలైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ ద్వారా వివిధ రకాలైన సేవా కార్యక్రమాల్లో చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, జగన్నాథం, కే ఆర్ శంకర్,ఈశ్వర్ రెడ్డి, గోపాల్, వెంకటేశం,శాంతి,గురవయ్య తదితరులు పాల్గొన్నారు

## త్రిభాషా సమాచార సాంకేతిక పదకోశం ముగింపు



యూనివర్సిటీ(తిరుపతి), మార్చి 14ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, శాస్త్ర వైజ్ఞానిక పరిభాషా కమీషన్, ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖసంయుక్తంగా నిర్వహించిన త్రిభాషా సమాచార సాంకేతిక పదకోశం నిపుణుల సలహా సంఘ సమీక్ష ముగిసింది. ఈ సమావేశంలో పదిమంది నిపుణులు కలిసి 2822 పదాలకు సమానార్థకాలను ఖరారు చేశారు. ఈ కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య కొలకలూరి మధుజ్యోతి విశ్వవిద్యాలయంలో రూపకల్పన చేసిన విధానం అభినందించారు. ప్రత్యేకంగా తెలుగు అధ్యయన శాఖలో జరగడం గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా దీపక్ కుమార్ ఈ బుక్ రూపంలో తొందరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కేశవమూర్తి ద్రావిడ విశ్వవిద్యాలయం, డాక్టర్ రఘు ఉస్మానియా యూనివర్సిటీ, డాక్టర్ భుజంగారెడ్డి సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్, డాక్టర్ ముత్తు లక్షి ్మ ,పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టర్ నాగలక్షి ్మ ,జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయం, డాక్టర్ సరిత , పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, డాక్టర్. వై. సుభాషిణి సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. డి. యువశ్రీ, డాక్టర్. బి. లక్షీ ్మ ప్రియ పీజీ ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు పాల్గొని జయప్రదం చేశారు.

## నేతమ్ షుగర్స్ ఫ్యాక్టరీ రైతులకు... ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

### - నేతాజీ చెరకు రైతు సంఘం



నింద్ర, మార్చి 14 ప్రభాతవార్త: నేతమ్ షుగర్స్ ఫ్యాక్టరీ రైతులకు 2024 ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం చెరకు బకాయిలు వెంటనే చెల్లించాలని నేతాజీ చెరకు రైతు సంఘం అధ్యక్షుడు బి.నారాయణస్వామిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలోని నేతమ్ షుగర్ ఫ్యాక్టరీ ఎదుట చెరకు రైతులు పెద్ద ఎత్తున చెరకు బకాయిలు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతమ్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు చెల్లించవలసిన 36 కోట్లు చెరకు బకాయిలు చెల్లించాలని గత ఆరు సంవత్సరాలుగా ధర్నాలు, రాస్తారోకోలు, అన్ని రాజకీయ పార్టీలు, అధికారులను కలిసి వినతిపత్రం ద్వారా తెలియపరిచినా ఏ మాత్రం పట్టించుకోలేదని వాపోయారు. పుత్తూరు ప్రచారంలో నేతమ్ షుగర్ ఫ్యాక్టరీ బకాయిలు టీడీపీ పార్టీ అధికారంలో వచ్చిన వంద రోజుల్లోచెల్లించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికీ మూడు సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు రైతులకు ఎలాంటి సాయం జరగలేదని, దీనిపై శనివారం తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై రాస్తారోకో చేయగా, చిత్తూరు జిల్లా కలెక్టర్ సెల్ఫోన్లో మాట్లాడుతూ రైతులకు న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలపడంతో రైతులు విరమించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాసులు యాదవ్, పట్టాభిరెడ్డి, మేమలత, సుదర్శంనాయుడు, గుణశేఖర్రెడ్డి, చంద్రశేఖర్రాజు, బాలయ్యానాయుడు, సీఐ భాస్కర్, ఎస్ఐ మల్లికార్జున్, తహసీల్దార్ ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

## వకుళమాత ఆలయంలో...అక్షర గోవిందం

### -చిన్నారుల అక్షరాభ్యాసంలో ప్రత్యేక కిట్



ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల: టిటిడిఆధ్వర్యంలో తిరుపతి రూరల్ పేరూరులోని వకుళమాత ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేసే కార్యక్రమం శ్రీకారం చుట్టనుంది. ఇప్పటికే అక్షర గోవిందం పేరుతో టిటిడి బోర్డు ఈ కొత్త కార్యక్రమానికి ఆమోదించింది. ఇక అందుకు తగ్గ కార్యాచరణ రూపొందిస్తున్నారు. తెలంగాణలో బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో తరహాలో ఆంధ్రప్రదేశ్ లో తిరుపతి వకుళమాత ఆలయంలో కూడా చిన్నారులకు అక్షరాభ్యాసం చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇందుకు "అక్షర గోవిందం" నామకరణం చేశారు. ఇందులో భాగంగా చిన్నారులకు ప్రత్యేక కిట్ ఇవ్వనుంది. ఈ అక్షరాభ్యాస వేడుక ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో, స్వామి వారి మాతృమూర్తి వకుళ మాత సన్నిధిలో చిన్నారుల అక్షరా భ్యాసం నిర్వహణకు వీలుగా టిటిడి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభ దశలో కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనుంది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఈ అక్షర గోవిందం ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. చిన్నారులకు ఏడు వస్తువులతో కిట్ అందజేయనున్నారు. అక్షరాభ్యా సానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా ఎంపిక చేశారు. ఆలయానికి తూర్పు వైపున ఉన్న ఖాళీ స్థలంలో ఈ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పుష్కరిణికి సమీపంలోని ఈ ప్రదేశం అనువైనదిగా గుర్తించారు. శాశ్వత ప్రాతిపదికన సకల వసతులతో మండపాన్ని నిర్మించనున్నారు. ఈ వేదిక పై వేంకటేశ్వర స్వామి, పద్మావతి, సరస్వతీదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ ప్రాంగణంలో చిన్నారులతో అక్షరాలు దిద్దించనున్నారు. అక్షరాభ్యాసం తర్వాత పిల్లలకు "అక్షర గోవిందం" పేరిట రూపొందించిన కిట్ ఇవ్వనున్నారు. ఈ కిట్ లో పలక, బలపాల ప్యాకెట్, శ్రీవారి అక్షతలు, అమ్మవారి కుంకుమ ప్యాకెట్టు, కంకణాలు, పటిక బెల్లం (కలకండ) ప్రసాదం ప్యాకెట్, వినాయకుడు సరస్వతీదేవి వేంకటేశ్వర స్వామితో కూడిన చిత్రపటం (ఫ్రేమ్) ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు, చిన్నారులకు టిటిడి శుభవార్తగానే మారింది.

## ప్రమాదానికి కారణమైన కారు పోలీస్ వాహనమా..?

### లేక ప్రైవేటు వ్యక్తి వాహనమా!



గంగవరం,మార్చి 14, ప్రభాతవార్త : కారు లారీని ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డ సంఘటన శనివారం సాయంత్రం మండలంలోని మల్లేరు సమీపంలో చోటు చేసుకుంది. అయితే ప్రమాదానికి కారణమైన కారు పోలీస్ సిబ్బందిదా..? లేక ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా పోలీస్ స్టిక్కర్ వేసుకొని వాహనాన్ని నడుపుతున్నారా అనే విషయం తెలియలేదు.స్థానికులు కథనం మేరకు వివరాలిలా..చిత్తూరు నగరానికి చెందిన డిఎం బాషా(40) అనే వ్యక్తి పుంగనూరు నుండి చిత్తూరుకు కారులో వస్తూ మండలంలోని పలమనేరు- మదనపల్లె జాతీయ రహదారిపై మల్లేరు సమీపంలో కారు వేగంగా,నిర్లక్ష్యంగా వస్తూ ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది,ఈ ప్రమాదంలో కారు బెలూన్స్ ఒపెన్ కావడంతో కారు ప్రమాణిస్తున్న డిఎం బాషాకు ఎలాంటి గాయాలు లేకుండా ప్రమాదం నుండి బయట పడ్డాడు. అయితే ప్రమాదానికి కారణమైన కారు పోలీస్ సిబ్బందిదా..? లేక ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా పోలీస్ స్టిక్కర్ వేసుకొని వాహనాన్ని నడుపుతున్నారా అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## పేటలో జనసేన ఆవిర్భావ దినోత్సవం



ఏర్పేడు,మార్చి 14 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం పాపానాయుడు పేట గ్రామంలో శనివారం జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా కేక్ను ఏర్పాటు చేసి కట్చేసారు. ఈ వేడుకల్లో నాయకులతో పాటు యువకులు భారీ సంఖ్యలో పాల్గొని బాణ సంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కిరణ్కుమార్ రామిశెట్టి పర్యవేక్షణలో కార్యక్రమాలు రూపకల్పన చేసి అమలు చేసారు.ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్దాంతాలతో పాటు పవన్కళ్యాణ్ ఆశయాలను ప్రజల వద్దకు తీసుకెళ్ళాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా కార్యకర్తలు జై జనసేన అంటూ నినాదాలు చేసారు.

## కారల్ మార్క్స్ 143 వర్థంతి




శ్రీకాళహస్తి,మార్చి 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో కమ్యూనిస్టు సిద్ధాంత కర్త,కారల్మార్క్స్ 143వ వర్ధంతిని నిర్వహించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా నియోజకవర్గ ఇన్చార్జి జనమాల గురవయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా పార్టీ సిద్ధాంత కర్త కారల్ మార్క్స్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ కారల్ మార్క్స్ ప్రపంచ కార్మిక వర్గానికి మార్గదర్శి అని సమానత్వ సమాజం కోసం ఆయన చూపిన చొరవ నేటికి ఆదర్శంగా ఉంటుందన్నారు.కూలీలు,పేద ప్రజల హక్కుల కోసం పోరాడే ప్రతి ఒక్కరు కారల్ మార్క్స్ సిద్ధాంతాలను తెలుసుకోవాలన్నారు.ఈ కార్యక్రమాల్లో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కత్తిరవి, ఏఐఎస్ఎఫ్ తిరుపతిజిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు, స్వీట్ వండర్స్ నాయకులుమురళి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## గుడిమల్లం ఆలయానికి ధ్వజస్థంభం



ఏర్పేడు,మార్చి 14 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయానికి ధ్వజస్థంభాన్ని విరాళంగా అందించారు. శనివారం ఎంఎల్సి బీద రవిచంద్ర జ్యోతిలు ఈ విరాళాన్ని ఆలయ ఇఓ రామచంద్రారెడ్డికి అందించారు. ఆలయాభివృద్ధికి సంబంధించి ఆలయ చైర్మెన్ గిరినాయుడు,ఇఓ రామచంద్రారెడ్డి పలువురు నాయకులను కలసి అభ్యర్థించారు. దాంతో దాతలు ముందుకు వచ్చి సహాకరిస్తున్నారు.ఈ నేపథ్యంలో గతంలో బీదరవిచంద్రను కలసి అభివృద్ధికి సహాకరించమని అభ్యర్థించారు. దాంతో వారు ధ్వజస్థంభం తయారు చేయుటకు ముందుకు వచ్చారు.ఈ నేపథ్యంలో శనివారం వారు ఆలయాన్ని సందర్శించారు. వారికి ప్రధాన ద్వారం వద్ద ఆలయ వేదపండితులతో ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వారు ఆలయాధికారి అర్చకులతో మాట్లాడుతూ తాము ఇచ్చిన హామీ మేరకు ధ్వజస్థంభం ఈ నెల 30 స్థాపనకు తేదీ ఖరారు చేసారు.ఈ మేరకు ఇఓ రామచంద్రారెడ్డి, వేదపండితులు యేగేంద్ర,పవన్ కుమార్శర్మ లకు సమాచారం అందించారు. ధ్వజస్థంభం స్థాపనకు భక్తులు తరలి రావాలని పిలుపు నిచ్చారు.

## అమ్మో దుమ్ము.. బయట రావాలంటే భయం..



వరదయ్యపాలెం, మార్చి 14 ప్రభాతవార్త: వరదయ్యపాలెం మండలంలో సామాన్య ప్రజలు, గ్రామస్తులు, ప్రయాణికులు బయట రావాలంటే దుమ్మును చూసి భయపడు తున్నారు. గత కొద్ది రోజుల క్రితం వాటర్ పైప్ లైన్ వేయడం కోసం రోడ్ సైడ్ కాలువలు తవ్వి వాటర్ పైప్ లైన్ వేసిన విషయం అందరికి తెలిసిందే. అయితే రోడ్ సైడ్ కాలవలు పూడ్చిన మట్టి అలానే ఉండిపోవడం, భారీ వాహనాలు, ఇసుక లారీలు, చిప్స్ లారీలు, పైన కనీసం పట్టగూడ కట్టుకోకుండా వెళ్లడంతో భారీగా దుమ్ము రావడం సామాన్య ప్రజలు చాలా తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటూ భారీ వాహనాలు వెళ్తున్న సమయంలో వెనక బైకులో వెళ్లాలన్న కార్లు వెళ్లాలన్న చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలుమార్లు స్థానిక అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకున్న దాఖలు లేవు. ఇకనైనా ఉన్నత అధికారులు సామాన్యులు పట్ల నిర్లక్ష్యం వహించకుండా సామాన్యులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించి ఆ సమస్యని వెంటనే పరిష్కరించవలసిందిగా సామాన్యులు వేడుకుంటున్నారు.

### పనిచేసే చోటే...

## పోలీస్ సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షలు

### -జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు




తిరుపతి,మార్చి 14ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని శనివారం ఉదయం తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించడం చాలా ఆనందదాయకమని తెలిపారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే సిబ్బంది రోజువారీగా బిజీగా ఉండటంతో ఆరోగ్యపరమైన విషయాలకు సరైన సమయం కేటాయించలేని పరిస్థితులు తరచుగా ఎదురవుతాయన్నారు. ఇలాంటి వైద్య శిబిరాల ద్వారా పోలీస్ సిబ్బందికి వారి పనిచేసే ప్రదేశంలోనే అవసరమైన వైద్య పరీక్షలు అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ఇలాంటి వైద్యశిబిరాల ద్వారా కంటి సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన చికిత్స పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి నిపుణులైన వైద్యులు ఆధునిక పరికరాల సహాయంతో కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 265 మంది పోలీస్ సిబ్బంది తమ కంటి పరీక్షలు చేయించుకొని, అవసరమైన వైద్య సూచనలు , చికిత్స గురించి సమాచారం పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరచారి,ఐ. రామకృష్ణ ,శ్రీనివాసులు ,డాక్టర్ సుమంత్ రెడ్డి అగర్వాల్ హాస్పిటల్ ఎండి, పోలీస్ డాక్టర్ మాధురి , అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## లోక్ ఆదాలత్లో 1937 కేసులు పరిష్కారం



తొట్టంబేడు,మార్చి 14 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి న్యాయస్థానాల్లో శనివారంజరిగిన లోక్ ఆదాలత్లో 1937 కేసులు పరిష్కరింపబడినట్లు జిల్లా అదనపు జడ్జి శ్రీనివాస్నాయక్ తెలిపారు. ఇందులో రూ.1,01,73,495లు వసూలు అయినట్లు కూడా జడ్జి వివరించారు. రాష్ట్రహైకోర్టు ఆదేశాలతో జాతీయ లోక్ ఆదాలత్ను నిర్వహించినట్లు వివరించారు. ఈ ఆదాలత్లో జడ్జిలు బేబీరాణి, కృష్ణప్రియ, సాంబశివ న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోక్ ఆదాలత్ నిర్వహణ సందర్భంగా తిరుపతికిచెందిన సంకల్ప ఆసుపత్రి నిర్వాహకులు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ లోక్ ఆదాలత్లో అన్ని రకాల సివిల్,క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చు, రాజీ చేసుకోవచ్చునని వివంరించారు. కక్షి దారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బంగారు చైన్ చోరీ..!

గంగవరం,మార్చి 14, ప్రభాతవార్త : తన ఇంట్లో దాచుకున్న బంగారు చైన్ చోరీకి గురైనట్లు దంపతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధిత దంపతులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా..మండలంలోని మేలుమాయి పంచాయతీ చిన్నమనాయని పల్లె గ్రామానికి చెందిన గీత,సుబ్బయ్య అనే దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు.ఈ దంపతులు కూలి చేసి పోగుచేసుకున్న డబ్బుతో తన కుమారుడికి 8 గ్రాముల బరువు గల సుమారు ఒక లక్ష రూపాయలు విలువ చేసే బంగారు చైన్ కొనుగోలు చేసి ఇంట్లో భద్రపరుచుకున్నారు. ఈ నేపథ్యంలో కుమారుడికి పాఠశాలలో పంక్షన్ ఉండడంతో బంగారు చైన్ను కుమారుడికి బహుకరించాలని చూడగా బంగారు చైన్ చోరీకి గురైనట్లు దంపతులు గుర్తించారు.తరచూ తమ ఇంటికి వస్తూ వెళ్తున్న సుబ్బయ్య పెద్దనాన్న కుమారుడు వరుసకు అన్న అయిన విజయ్కుమార్(40) ఈ చోరీకి పాల్పడినట్లు అనుమానించిన దంపతులు అతనిని విచారించగా మీ ఇంట్లో పట్టపగలే నేనే చోరీ చేసి పలమనేరు పట్టణంలోని ఓ నగల దుకాణంలో రూ.20 వేలకు తాకట్టు పెట్టానని చెప్పినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.పోలీసులు నిందితుని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### నేరాల త్వరిత పరిష్కారంలో

## రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు




తిరుపతి,మార్చి 14ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను గుర్తిస్తూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రకటించే ప్రతిష్టాత్మక ఏబిసిడి అవార్డు లో తిరుపతి జిల్లా పోలీసులకు గౌరవప్రదమైన గుర్తింపు లభించింది. క్రైమ్ డిటెక్షన్లో రాష్ట్ర స్థాయి లో ప్రతిష్టాత్మక ఈ " అవార్డు సాధించిన తిరుపతి జిల్లా పోలీసుల తరపున డిజిపి హరీశ్కుమార్గుప్త నుండి తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అందుకున్నారు.అక్టోబర్ - డిసెంబర్ మాసాంతంలో తిరుపతి జిల్లా రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలోని గాజులమండ్యం పోలీస్ స్టేషన్లో నమోదైన క్రైమ్ నెంబర్ 294/2025 హత్య కేసును సమర్థవంతంగా ఛేదించినందుకు రాష్ట్ర స్థాయిలో అవార్డు సొంతమైంది. గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటనలో అన్ని కోణాలలో దర్యాప్తు చేసి మృతదేహం ను గుర్తించి, హత్య కేసు గా నిర్ధారించుకొని, ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఈ సందర్భంగా డిజిపి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డిజిపి నుండి ఏబిసిడి అవార్డును రేణిగుంట డిఎస్పీ వై శ్రీనివాసరావు ,రేణిగుంట రూరల్ సిఐ మంజునాథ రెడ్డి, తిరుచానూరు యస్.ఐ సుధాకర్, క్రైమ్ పార్టీ సిబ్బంది అందుకున్నారు. అత్యంత నైపుణ్యంతో దర్యాప్తు జరిపి కేసును వేగంగా ఛేదించినందుకు రేణిగుంట సబ్ డివిజన్ డీఎస్పీ బృందం ను జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అభినందించారు.

## ప్రశాంతంగా సివిక్స్ పేపర్1

తిరుపతి విద్య, మార్చి 14 ప్రభాతవార్త. జిల్లా వ్యాప్తంగా 84 కేంద్రాలలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ సివిక్స్ పేపర్1 ప్రశాంతంగా జరిగిందని ఆర్ ఐఓ జి రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సివిక్స్ పరీక్షకు జిల్లాలో 4885 మందికి గాను 4540 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని,, 345 మంది గైర్హాజరైనట్లు తెలియజేశారు. అలాగే సోమవారం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మోడర్న్ లాంగ్వేజ్ పేపర్2 తో పాటు జాగ్రఫీ పేపర్ పేపర్2 పరీక్ష జరగనుందని తెలిపారు.